# డస్ట్‌బిన్‌లు లేవు ..స్వచ్ఛ ఆటోలు రావు

-కాలనీలు, బస్తీల్లో గాడితప్పుతున్న పారిశుధ్యం
-రెండు మూడు రోజులైనా కానరాని ఆటోలు
-జివిపి పాయింట్లలోనే చెత్తవేస్తున్న జనాలు
-గాలి,వాన వస్తే రోడ్లపైకి చెత్త కొట్టుకొస్తున్న వైనం
-నిర్వాహణ లోపంతో పెరుగుతున్న దోమల బెడద




**హైదరాబాద్, డిసెంబరు 5,ప్రభాతవార్త:** గ్రేటర్ సిటీలో చెత్తసమస్య తొలగడం లేదు. జిహెచ్ఎంసి ఎన్ని ప్రయోగాలు చేసినా పారిశుద్ధ్య నిర్వాహణ లోపం స్పష్టంగా కనిపిస్తుంది. మూడేళ్ల క్రితం డస్ట్‌బిన్ లెస్‌సిటీ పేరుతో గత ప్రభుత్వం దీంతో కాలనీలు, మార్కెట్‌లు, ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పెద్దపెద్ద చెత్తకుండీలను ఎత్తివేసింది. దీంతో అప్పటినుంచి చెత్తసమస్య తీవ్రమవుతుంది. ఏండ్లు గడుస్తున్నా డస్ట్‌బిన్ లెస్ సిటీగా మారడం లేదు. ప్రస్తుతం జనం చెత్తను జివిపి పాయింట్లలో వేస్తుండగా ఎలాంటి ఫలితం లేదు. డస్ట్‌బిన్ లేక వేసిన చెత్తంతా రోడ్లపైకి వచ్చి చేరుతుంది. అలాగే ఇంటింటికి వెళ్లి సేకరించే స్వచ్ఛ ఆటోలు రెండుమూడు రోజులు ఓసారి వస్తుండటంతో ఇండ్లలో చెత్తవిపరీతంగా పేరుకుపోతుంది. దీంతో రాత్రిపూట రోడ్లపై ఎక్కడపితే అక్కడ జనం చెత్తను పారబోస్తున్నారు. గ్రేటర్‌లో కోటికి పైగా జనాభా నివసిస్తుండగా కేవలం 4,500 స్వచ్ఛఆటోలు మాత్రమే ఉన్నాయి. ఇందులో దాదాపు 500లకుపైగా ఫీల్డ్‌లోకి రావడం లేదు. ఓనర్ కమ్ డ్రైవర్ స్కీమ్ కింద స్వచ్ఛ ఆటోలు అందించగా కొందరు పత్తాలేకుండా పోయారు. మరికొందరు సొంతపనులకు వాడుకుంటుండగా చెత్తసేకరణకు చాలా ప్రాంతాల్లో పోవడం లేదు. కొన్ని ప్రాంతాల్లో సమయానికి ఆటోలు రాకపోవడంతో చెత్తను వేయలేకపోతున్నామని, ఇంటివద్ద పెడితే తీసుకెళ్లడం లేదని తెలుపుతున్నారు. అలాగే కొంతమంది స్వచ్ఛఆటోలు నడిపేవారు కాలనీల్లో కొద్దిసేపు తిరిగి అసంపూర్తిగానే విధులు ముగించుకుని అనంతరం ప్రైవేట్ హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర వ్యాపార కేంద్రాల్లోని వ్యర్థాలను సేకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా బస్తీలు,చిన్నచిన్న కాలనీలకు వారానికి ఒకటిరెండు సార్లు మాత్రమే వస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. న్నాయి.

**సమయానికి తీసుకెళ్లకుండా ..**

స్వచ్ఛఆటోలకు ఆయా కాలనీల్లో కేటాయించిన ఇండ్లకు వెళ్ళి ప్రతి ఇంటి నుంచి క్రమం తప్పకుండా తడి,పొడి చెత్తను విభజించి ,వేర్వేరుగా డంపింగ్ యార్డ్‌కు తరలించాల్సిన బాధ్యత వారిపై ఉంది. దీనికి గానూ సర్వీస్ చార్జీల కింద ప్రతి ఇంటి యజమానినుంచి కొంత రుసుము వసూలు చేస్తుంటారు. సంపన్నులు ఉండే కాలనీల్లో నెలకు రూ.200 వసూలు చేస్తుండగా పేదల బస్తీలల్లో నెలకు రూ.100-150 వరకు వసూలు చేస్తున్నారు. దీంతో ఆంటోలు నడిపేవారు నెలకు 50నుంచి 60వేల ఆదాయం పొందుతున్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లో ఆటోలు సమయానికి రాకుండా రెండు మూడురోజులకు ఇకసారి వస్తే నెలాకరులో డబ్బులు ఇచ్చేందుకు యజమానులు నిరాకరిస్తున్నారు. దీంతో స్వచ్ఛ ఆటోల నిర్వాహకులు వారితో గొడవకు దిగుతున్నారు. అలాగే నగరంలో దాదపు 500చోట్ల వారంతపు సంతలు జరగుతున్నాయి. సంత జరిగిన రోజు అక్కడ దాదాపు రెండూ మూడు టన్నుల చెత్త పోగవుతుంది. అలాగే చిన్నచిన్న తోపుడు బండ్లు,చిరుతిండ్లు విక్రయించే దుకాణాలవద్ద పోగయ్యే చెత్తను సైతం దుకాణదారులు అడిగినంత డబ్బులుఇవ్వకపోవడం తో సేకరించటం లేదన్న ఆరోపణలు వినిస్తున్నాయి.

**జిపిఎస్‌ను ట్యాంపరింగ్ చేస్తూ ...**

స్వచ్ఛఆటోలపై కదలికలు పెట్టేందుకు రెండేళ్ల క్రితం ఆటోలకు జిపిఎస్ పరికరం అమర్చి జిహెచ్ఎంసి కేంద్రకార్యాలయంలోని సాఫ్ట్‌వేర్‌కు అనుసంధానం చేసి, వాటి కదలికలపై నిఘా ఉంచారు. దీంతో ఏసర్కిల్ స్వచ్ఛఆటో ఎక్కడ తిరుగుతుందో తెలుసుకునే అవకాశం కేంద్ర కార్యాలయ సిబ్బందికి తెలుస్తుండటంతో జవాబుదారీతనం పెంపొంది చెత్తసేకరణ సరిగ్గా జరుగుతుందని భావించారు. కానీ కొందరు తమ వాహనానికి అమర్చిన జిపిఎస్ పరికరాన్ని సైతం ధ్వంసం చేసి వాహనాలు నడిపిస్తుండగా అధికారులు సైతం వారిని పట్టుకుని జరిమాని విధించారు. అయినా వారిలో మార్పు రావడం లేదు. మరికొందరు రోజూ ఏదో ఒకకారణం చెప్పి రెండు మూడు రోజులకోసారి చెత్త సేకరిస్తున్నారు. దీంతో చేసేది ఏమీలేక కొందరు ఇంటి యజమానులు తమ ఇళ్లల్లో వెలుబడే తడి,పొడి చెత్తను రహదారులు, నాలాలు వెంట పారబోస్తున్నారు.



# ఇందిరమ్మ రాజ్యంలోనే సొంతింటి కల సాకారం

-రాజకీయాలకతీతంగా డబుల్‌బెడ్‌రూం ఇళ్లు పంపిణీ -రెవెన్యూ, హౌసింగ్‌శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**హైదరాబాద్, డిసెంబరు 5,ప్రభాతవార్త:** పేదల సంక్షేమనికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇందిరమ్మ రాజ్యంలోనే పేదల సొంతింటి కల సాకారం అవుతుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈమేరకు గురువారం హైదరాబాద్ కలెక్టరేట్ ఆవరణలో జూబ్లీ హిల్స్ నియోజకవర్గంలోని కమలానగర్, ముషీరాబాద్ నియోజకవర్గంలోని బాకారం లకు చెందిన 81 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పట్టాలను మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలసి లబ్ధిదారులకు అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ఎక్కడకూడా ఇబ్బందులు ఉత్పన్నం కాకుండా పారదర్శకంగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పట్టాలను పంపిణీ చేపడుతున్నాని స్పష్టం చేశారు. సెక్రటేరియట్ నందు రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు చేతుల మీదుగా ఇందిరమ్మ ఇండ్ల యాప్‌ను ప్రారంభించుకుంటున్నామని తెలిపారు. ప్రతి నియోజవర్గంలో అర్హులైన పేదలను గుర్తించి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి ఐదు లక్షల రూపాయలు విడతల వారీగా అందచేయడం జరుగుతుందని అన్నారు. రాష్ట్రంలో రాబోయే 4 సంవత్సరాలలో 4 లక్షల 50 వేల ఇండ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. ప్రతి నియోజక వర్గంలో పేదలకు అందించే ఇందిరమ్మ ఇండ్ల సర్వే చేయుటకు అధికారులు వస్తారని పేద ప్రజలు పూర్తి సమాచారం అందించాలని అన్నారు. మరో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే మొబైల్ యాప్ ప్రారంభిస్తున్నమని,అసలైన అర్హులైన లబ్ధిదారులకు తప్ప ఇతరులకు ఎవరికీ అవకాశం లేకుండా కఠినంగా పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక జరగాలన్నారు. హైదరాబాద్ లో ఉన్న స్లమ్ ఏరియాలో ఇందిరమ్మ ఇళ్ల సంఖ్యను పెంచేలా ప్రభుత్వం తరుపున ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలని అన్నారు. హైదరాబాద్ కలెక్టరేట్, జీహెచ్ఎంసీ కలపి సమన్వయంతో అనేక సంస్కరణలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకి అనుగుణంగా తమ ప్రభుత్వం ముందుకు పోతుందని తెలిపారు.జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ అర్హులైన పేదలకు ర్యాండమైషన్ ప్రక్రియ ద్వారా పారదర్శకంగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పట్టాలను అందచేస్తున్నామని అన్నారు. పట్టాల పంపిణిలో వికలాంగులకు ఫస్ట్‌ఫ్లోర్‌లో ఇండ్లను కేటాయించామని తెలిపారు. అలాగే హెచ్ఎండిఏ, జిహెచ్ఎంసి తరఫున మౌలిక సదుపాయాలు కరెంటు, నీరు కల్పించడం జరిగిందన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కాలనీవాసులు సొసైటీ, అసోసియేషన్ గా ఏర్పడి కాలనీని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి మేయర్ గద్వాల విజయ లక్ష్మీ, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి,ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎమ్మెల్సీ బలమూరి వెంకట్, మాజీ ఎంపీ అంజనీ కుమార్ యాదవ్, అదనపు కలెక్టర్ ముకుంద రెడ్డి, డిఆర్వో ఈ వెంకటాచారి, కార్పొరేటర్లు సిఎన్ రెడ్డి, రచన శ్రీ తదితరులు పాల్గొన్నారు



ఇళ్లపట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి పొంగులేటి, పొన్నం ప్రభాకర్, కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి, మేయర్‌గద్వాల్ విజయలక్ష్మీ తదితరులు

# నిధులు రాక... ఇక పనులన్నీ చకచకా..

-రహదారుల విస్తరణ,ఫ్లైఓవర్ల నిర్మాణానికి భారీగా నిధులు
-రూ.5,942 కోట్లకు పరిపాలన అనుమతిలిచ్చిన పురపాలకశాఖ
-తక్షణమే టెండర్లు పిలిచి పనులు చేపట్టాలని ఉత్తర్వులు

**హైదరాబాద్, డిసెంబరు 5,ప్రభాతవార్త:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో హెచ్‌సిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్) ప్రాజెక్టులో భాగంగా చేపట్టే రహదారుల విస్తరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు విడుదల చేసింది. రూ.5,942 కోట్ల నిధులకు పరిపాలన అనుమతులు ఇస్తూ పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణమే టెండర్లు పిలిచి ఈ నిధులతో పనులు చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మూడు రోజుల క్రితం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాపాలన విజయోత్సవాల్లో హెచ్‌సిటీలో చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. తాజాగా ప్రభుత్వం జీహెచ్ఎంసీలోని ఆరు జోన్లలో 5 ప్యాకేజీల్లో చేపట్టనున్న పనులకు నిధులు మంజూరు చేసింది. అందులో భాగంగా సికింద్రాబాద్ జోన్లోని ఏవోసీ సెంటర్ చుట్టూ ప్రత్యామ్నాయ రహదారుల నిర్మాణం కోసం అత్యధికంగా రూ.940 కోట్లు విడుదలకు అనుమతులు ఇచ్చింది. శేరిలింగంపల్లి జోన్‌లో ఖాజాగూడ, ఐఐటీ జంక్షన్, విప్రో జంక్షన్ల అభివృద్ధికి రూ.837 కోట్లు, మియాపూర్ ఎక్స్ రోడ్డు నుంచి ఆల్విన్ ఎక్స్ రోడ్డు వరకు ఆరు వరుసల ఫ్లైఓవర్, లింగంపల్లి నుంచి గచ్చిబౌలి వైపు మూడు వరుసలతో అండర్ పాస్ నిర్మాణానికి రూ.530 కోట్లు విడుదల చేసింది. ఎల్బీనగర్ జోన్‌లో టీకేఆర్ కాలేజీ జంక్షన్ నుంచి మందమల్లమ్మ చౌరస్తా వరకు ఆరు వరుసల ఫ్లైఓవర్ కోసం రూ.416 కోట్లు, ఖైరతాబాద్ జోన్ పరిధిలో రైతిబౌలి నుంచి నానల్ నగర్ జంక్షన్ వరకు మల్టీ లెవల్ ఫ్లైఓవర్ నిర్మాణానికి రూ.398 కోట్లు విడుదల చేస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.




# కుకింగ్ ఆయిల్.. డేంజర్ బెల్!

-మెరిసేదంతా మంచి నూనె కాదు
-ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటళ్లలో నాణ్యతకు తిలోదకాలు
-ఆరోగ్య సమస్యలు తప్పవంటున్న నిపుణులు
-గానుగ నూనెకు పెరుగుతున్న డిమాండ్
-రైస్ బ్రాన్ ఆయిల్‌పైనా మక్కువ



**హైదరాబాద్, డిసెంబరు 5 ప్రభాతవార్త** ఆహార ప్రియులకు వంట నూనె డేంజర్ బెల్స్ మోగిస్తోంది. ఈ మధ్య హోటళ్లలో తనిఖీలు చేసినప్పుడు పేరున్న సంస్థలు సైతం నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని తేలిపోయింది. ఇక రోడ్డు పక్కన బండిపై బజ్జీలు, సమోసాలు, జిలేబి, ఇతర ఫాస్ట్‌ఫుడ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరంలేదు. నూను రంగు మారినా అందులోనే వంటకాలను తయారు చేసి వినియోగదారులకు ఇస్తున్నారు. ఇదంతా ఆరోగ్యానికి హానికరమని తెలిసినా.. తాము తినేది మంచి ఆహారమే అనుకుంటూ లాగించేస్తున్నారు. ఆరోగ్యం చెడి వైద్యుల దగ్గరకు వెళ్లాక అసలు విషయం తెలిసి నష్ట నివారణ చర్యలకు ఉపక్రమిస్తున్నారు.

మార్కెట్లో లభించే నూనెలో వేరుశెనగ నూనె, ఆవ నూనె, అవిశే నూనె, అవకాడో అయిల్, సన్‌ఫ్లవర్ అయిల్, కొబ్బరి నూనె, నువ్వుల నూనె ఇలా రకరకాల నూనెలు అంటుబాటులో ఉన్నాయి. మిర వీటిలో ఏ నూనె ఆరోగ్యానికి మంచిదనేది ఏవరికి వారి వాదనలున్నాయి. వంటల్లో విరివిగా వినియోగంచే నూనెల విషయంలో ఆచితూచి వ్యవహరించాలని జాతీయ పౌష్టికాహార సంస్థ (ఎన్ఐఎన్) సూచిస్తోంది. నూనెల శుద్ధిలో ఆయా తయారీ సంస్థలు అనుసరిస్తున్న విధానంతో సంప్రదాయంగా ఉండే పోషక విలువలు తగ్గుముఖం పడుతున్నాయని, కేవలం సారంలేని నూనెలు మాత్రమే బహిరంగ మార్కెట్‌లోకి వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే గానుగ నూనెలకు గిరాకీ పెరుగుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి.మార్కెట్‌లో లభించే వివిధ కంపెనీలకు చెందిన సన్‌ఫ్లవర్, వేరుసెనగ నూనె వినియోగించేవాళ్లం, గత రెండేళ్ల నుంచి గానుగ పట్టించిన నూనె కొనుగోలు చేస్తున్నామని చిక్కడపల్లికి చెందిన వ్యాపారవేత్త కృష్ణ పేర్కొన్నారు. మన కళ్ల ముందే పట్టి ఇస్తున్నారు. నూనె ధరలో మాత్రం భారీ వ్యత్యాసం కనిపిస్తోందన్నారు. ముఖ్యంగా నూనెల ప్రాసెసింగ్ ప్రక్రియలో విటమిన్ ఏ,డీ,ఈలను జత చేస్తున్నారు. ఫలితంగా నూనె ఆకర్షణీయ రంగు వస్తోంది. అయితే.. ఈ రంగే మనల్ని మోసం చేస్తుందనేది అందరికీ తెలియదు. రసాయనాలు, ఇతరత్రా కలపడంతో రంగు మారుతోంది. దీంతో క్యాన్సర్, ఇతర రోగాలు వచ్చే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పట్టణాలోన్ల ఆపార్ట్‌మెంట్ కల్చర్ పెరిగి ఇంట్లోనే ఉంటున్నారు. దీంతో విటమిన్ డీ, కాల్షియం లోపం కనిపిస్తోంది. పీసీఓడీ సమస్య ఉన్నవారికీ, బాలింతలు నువ్వుల నూనె వాడాలంటూ నిపుణులు సూచిస్తున్నారు. పెరిగిన రైస్ బ్రాన్ ఆయిల్ వినియోగం..

గుర్తింపు పొందిన కంపెనీల్లో నూనె ప్యాకింగ్ అయి మార్కెట్‌లోకి రావడానికి సుమారు 80 రకాల పరీక్షలు నిర్వహిస్తారు. ఆరోగ్యపరంగా రక్షణ చర్యలు పాటిస్తారు. సన్‌ఫ్లవర్, వేనుసెనగ, రైస్ బ్రాన్ వంటి నూనెలు నెలనెలా మార్చి వినియోగిస్తుండాలి. గడిచిన రెండేళ్లుగా రైస్ బ్రాన్ ఆయిల్ వినియోగం గణనీయంగా పెరుగుతోంది. గుండె సంబంధిత వ్యాధులకు రైస్‌బ్రాన్ నూనె మంచిది. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో నూనె రంగు మారినంత వరకు మరుగుతూ ఉంటుంది. ఆటువంటి వాటివల్ల ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందని ప్రముఖ వైద్యనిపుణులు మంచుకొండ రంగయ్య పేర్కొన్నారు.

**రంగు మారిన నూనెలతో ప్రమాదం..**

రిఫైన్డ్ ఆయిల్ ప్రాసెసింగ్‌లో కెమికల్స్ కలపాల్సివస్తోంది. దీంతో పోషక విలువలు పోతున్నాయి. దీన్ని భర్తీ చేయడానికి కొన్ని కంపెనీలు విటమిన్ ఏ,డీ,ఈలను యాడ్ చేస్తున్నాయి. వీటన్నిటికంటే గానుగ నూనె వినియోగించండి అని సూచిస్తున్నాం. అందులోనే పోషక విలువలు పుష్కలంగా ఉంటాయి. కొన్నిసార్లు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో నూనె నల్లగా రంగు మారినా అందులోనే బజ్జీలు వేయడం వంటివి చూస్తుంటాం. దీనివలన్ల ప్రీరాడికల్స్ అభివృద్ధి చెంది మన శరీరంలోని సెల్స్‌ను నాశనం చేస్తాయి.

**ఇ.కల్పన, న్యూట్రీషన్ నిపుణులు.**



# భారతదేశ స్వాతంత్ర్య సమరంలో ముస్లింల పాత్ర త్యాగాలు మరువలేం

-ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క




బ్లడ్ స్పీక్స్ టూ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న భట్టివిక్రమార్క, అస్మతుల్లా, రియాజ్, కోత్వాల్, జావీద్ తదితర అతిథులు

**రవీంద్రభారతి, డిసెంబరు 5 ప్రభాతవార్త :** భారతదేశ స్వాతంత్ర్య సమరంలో ముస్లిం పాత్ర, త్యాగాలు మరువలేమని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ఇంక్విలాబ్ జిందాబాద్, క్విట్ ఇండియా, డూ ఆర్ డై నినాదాలను ఇచ్చింది ముస్లిం నాయకులేనని అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ సౌజన్యంతో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో గురువారం మధ్యాహ్నం సయ్యద్ షానవాజ్ అహ్మద్ ఖాద్రీ రచన, పర్వేజ్ ఆలం సిద్ధిఖీ అనువాదం, అబ్దుల్ వాసీ సంపాదకత్వంలో భారతదేశ స్వాతంత్ర్యంలో ముస్లింల పాత్ర అనే అంశంతో వెలువడిన బ్లడ్ స్పీక్స్ టూ ప్రతిష్టాత్మక పుస్తకాన్ని ముఖ్యఅతిథిగా విచ్చేసిన భట్టు విక్రమార్క పాల్గొన్న విశిష్ట అతిథులు వక్ఫ్‌బోర్డ్ ఛైర్మన్ సయ్యద్ అస్మతుల్లా హుస్సేని, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రియాజ్, మైనార్టీ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కోత్వాల్, కార్యనిర్వాహక కమిటీ కన్వీనర్ ఎండి జావీద్ తదితరులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రాణాలకు తెగించి పోరాటం చేసిన ముస్లింల చరిత్రను మరుగునపరచాలని, చరిత్రలో భాగస్వామ్యంలేని వారు భారత రాజకీయ ముఖచిత్రాన్ని కలుషితం చేయాలని కుట్రలు పన్నుతున్నారన్నారు. నిజాం నిరంకుశ రాచరిక పరిపాలనకు వ్యతిరేకం జరిగిన పోరాటంలోనూ ముస్లింలు పాల్గొన్నారని చెప్పారు. ఆనాడు కుల మత వర్గ రహితంగా అందరూ సమిష్టిగా పోరాడితేనే స్వాతంత్ర్యం వచ్చిందని గుర్తుచేశారు. దేశంలో వనరులు, రాజకీయ, ఆర్థిక అవకాశాలు జనాభా ప్రాతిపదిక అందరికీ సమానంగా పంచాలనే సదుద్దేశంతో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా కులగణన నిర్వహించామన్నారు. ప్రేమను పంచుతూ లౌకికవాదంతో అందరం జీవిద్దామని, కన్యాకుమారి నుండి కాశ్మీరు వరకు రాహుల్‌గాంధీ పాదయాత్ర చేశారని, దేశంలో లౌకికవాదాన్ని నిలబెడుతూ రాజ్యాంగంలో పొందుపరిచిన మమతానురాగాల కోసం పోరాటం చేస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి అండగా ఉందామని పిలుపునిస్తూ భారత రాజ్యాంగాన్ని మనం కాపాడుకుంటే ఆ రాజ్యాంగమే మనను కాపాడుతుందని హితవుపలికారు.

# కళాసిగూడలో లభ్యమైన చిన్నారి తల

-తలను కవర్లో పెట్టి పడవేసిన వైనం
-కుక్క తీసుకువచ్చినట్లు గుర్తించిన పోలీసులు

**బేగంపేట డిశంబరు5,ప్రభాతవార్త :** నిత్యం అత్యంత రద్దీగా ఉండే కళాసీగూడా ప్రాంతంలో ఒక శిశువు తల ప్లాస్టిక్ కవర్లో లభ్యం కావడం స్థానికంగా కలకలం రేపింది.ఈ సంఘటన మహంకాళీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మహంకాళీ ఇన్స్‌పెక్టర్ పరుశురాం కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కళాసీగూడా చంద్రా ఆర్కేడ్ వ్యాపార సముదాయంలో ఉన్న మెట్ల మీద ఉన్న ప్లాస్టిక్ కవర్ నుంచి తీవ్ర దుర్వాసన వస్తుండటం గమనించిన స్థానిక వ్యాపారి ఎస్ కే.జహీర్ మహంకాళీ పోలీసులకు సమాచారం ఇచ్చారు.ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కవర్ ను పరిశీలించగా అందులో అప్పుడే పుట్టిన శిశువు తల ఉందన్నారు.ఆప్రాంతంలో సీసీ కెమెరాలను పరిశీలించగా సాయిబాబా ఆలయం సమీపంలోని మురికి కాల్వ నుంచి కుక్క ఈ కవర్ ను తీసుకు వచ్చినట్లు గుర్తించామన్నారు.పసికందు తలను ఎవరైనా వేరు చేసారా లేక మరేమైనా జరిగిందా అన్న విషయాలను విచారిస్తున్నామన్నారు.కవర్లో లభ్యమైన తలను గాంధీ మార్చురీకి తరలించామన్నారు.అసలు ఆ కవర్ లో ఉన్న తలను ఎవరు తెచ్చి అక్కడ పడవేశారు.మరి మొండెం ఏమైంది అన్న విషయాలను తెల్సుకునేందుకు సీసీ కెమెరాలను పరిశీలించి దర్యాప్తు చేస్తున్నామని ఇన్స్‌పెక్టర్ పరుశురాం తెలియజేసారు.

# తండ్రి బియ్యం వ్యాపారి.. కొడుకు డ్రగ్స్ వ్యాపారి..

-ఇప్పటికే మూడుసార్లు జైలుకు వెళ్ళొచినా మళ్ళీ అదే దందా
-డ్రగ్స్‌అమ్ముతూ ఎక్సైజ్ పోలీసులకు చిక్కిన లీలాకృష్ణ

**హైదరాబాద్, డిసెంబరు 5,ప్రభాతవార్త:** డ్రగ్స్‌కు అలవాటు పడిన ఓయువకుడు ..అమ్మకం దారుగా మారి పోలీసులకు చిక్కాడు లీలా కృష్ణ అనే 24ఏళ్లు యువకుడు. ఎవరికి ఏ రకమైన డ్రగ్ కావాలన్నా సప్లై చేసే స్థాయికి ఎదిగాడు. తండ్రి బియ్యం వ్యాపారం చేస్తుంటే కొడుకు డ్రగ్స్ వ్యాపారం చేస్తున్నాడు. ఇప్పటికే మూడుసార్లు డ్రగ్స్ అమ్ముతూ పట్టుబడిన ఆయువకుడు నాలుగోసారి ఎక్సైజ్ ఎస్టిఎఫ్ పోలీస్ లకు పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళితే.. నిజాంపేట్ కుశాల్ పార్క్ హై టెన్షన్ లైన్ రోడ్డులో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయని సమాచారం మేరకు ఎక్సైజ్ ఎస్ టి ఎఫ్ సీఐ నాగరాజు బృందం ఈ ప్రాంతంలో గురువారం తనిఖీలు నిర్వహించారు. బ్యాగులో డ్రగ్స్ ను పెట్టుకొని అమ్మకాలకు ప్రయత్నాలు చేస్తున్న సమయంలో ఎక్సైజ్ పోలీసులు లీలా కృష్ణుడు పట్టుకున్నారు. అతని బ్యాగులో తనిఖీలు నిర్వహించగా 17.07 ఓజీ కుష్ గంజాయి, 2.34. గ్రాముల ఎండిఎంఏ డ్రగ్స్,2 ఎల్ ఎస్ డి బ్లాస్ట్,220 గ్రాముల ఎండు గంజాయి లభించింది. పట్టుబడిన డ్రగ్స్ గంజాయి విలువ రూ.1.40 లక్షలు గా ఉంటుందని సీఐ తెలిపారు. లీలా కృష్ణ గతంలోనూ 2022,23లో ఎస్ఓటి పోలీసులకు పట్టుబడ్డాడు ఆతర్వాత ఈఏడాది మేలో కూడా పట్టుబడ్డాడు. మూడుసార్లు జైలుకు వెళ్లి వచ్చినటువంటి లీలా కృష్ణ నాలుగో సారి కూడా డ్రగ్స్ అమ్ముతూ మళ్ళీ చిక్కాడు గోవాలోని అంజనా బీచ్ లో ఉన్నటువంటి డ్రగ్స్ వ్యాపారి వద్ద డ్రగ్సును హైదరాబాదుకు తీసుకువచ్చి ఇన్‌స్టాగ్రామ్ లో అందరికీ అమ్మకాలు చేస్తున్నాడని పోలీసులు వెల్లడించారు. ఈటీం లో ఎస్టిఎఫ్ సి.ఐ నాగరాజు తో పాటు ఎస్సై జ్యోతి, హెడ్ కానిస్టేబుల్ అన్వర్ లేక సింగ్, కానిస్టేబుల్ రాజేశ్వర్ వికాస్ శశి చంద్రశేఖర్‌లు ఉన్నారు.అన్ని రకాల డ్రగ్స్ ను అమ్మకాలు జరిపే నొటోరియల్ క్రిమినల్ లీలా కృష్ణను పట్టుకున్న హెచ్డిఎఫ్ టీం ను ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విబి కమలాసన్ రెడ్డి అభినందించారు.

# గంజాయి మత్తులో ఇద్దరు మధ్య గొడవ

-ఒకరి మృతి

**మలక్ పేట డిసెంబరు 5, ప్రభాతవార్త:** గంజాయి మత్తులో ఇద్దరు వ్యక్తుల మధ్య గొడవ జరిగి ఒకరు మృతి చెందిన సంఘటన చాదర్ ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్స్పెక్టర్ రాజు కథనం ప్రకారం అఖిల్ (25), ముస్తఫా (45) ఇద్దరూ గంజాయి కి అలవాటు పడి చాదర్ ఘాట్ చమన్ వద్ద బిక్షాటన చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. గురు వారం సాయంత్రం ఇరువురు మధ్యన గొడవ జరిగి అఖిల్ (25) పై ముస్తఫా అనే వ్యక్తి బండరాయితో తలపై కొట్టడంతో ఆఖీల్ తలకు తీవ్ర గాయాలు అయి అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన గురించి తెలియడంతో చాదర్ ఘాట్ ఇన్స్పెక్టర్ రాజు, ఎస్సైలు సిబ్బందితో కలిసి సంఘటన ప్రాంతానికి చేరుకుని పరిశీలించారు. సంఘట ప్రాంతాన్ని డిసిపి కాంతిలాల్ పాటిల్, ఏసీపి శ్యాం సుందర్ లు సందర్శించి పరిశీలించారు. ఇన్స్పెక్టర్ రాజు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీ కి తరలించి దర్యాప్తు చేస్తున్నారు . సంఘటన జరిగిన వెంటనే గంజాయి సేవించిన ముస్తఫాను పోలీసులు అదుపులో తీసుకున్నట్లు సమాచారం.



సంఘటన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీసీపీ కాంతిలాల్ పాటిల్ తదితరులు

## నాగేశ్వర రావుకు ఘంటసాల జీవన సాఫల్య పురస్కారం



పేరి నాగేశ్వర రావుకు ఘంటసాల జీవన సాఫల్య పురస్కారం అందించిన దృశ్యం

**చిక్కడపల్లి డిసెంబర్ 5 ప్రభాతవార్త :** ఘంటసాల పాటల అనుకరణలో మెటి పెరి నాగేశ్వర రావు అని ప్రముఖ గాయకుడు త్రినాథరావు ప్రశంసించారు. శ్రీ త్యాగరాయ గానసభలోని కళా దీక్షితులు కళా వేదిక పై భారత్ ఆర్ట్స్ అకాడమీ, ఏ బి సి ఫౌండేషన్ నిర్వహణ లో విశిష్ట గాయకుడు పెరి నాగేశ్వర రావు కు ఘంటసాల వేంకటేశ్వర రావు జీవన సాఫల్య పురస్కారం ప్రదానోత్సవం సభ జరిగింది సంస్థ ల పక్షాన వరల్డ్ రికార్డ్స్ సమన్వయకర్త కెవీ రమణా రావు పాల్గొని పురస్కారం త్రినాథ రావు తో కలిసి బహుకరించి మాట్లాడారు. చాలా మంది గాయకులు ఘంటసాల పాటలు పాడుతూ నే వున్నా నాగేశ్వర రావు గళం విభిన్న మన్నారు అయన కొన్ని పాటల లో ఘంటసాల స్వరానికి సామీ ప్యం గా వుంటుందని అందుకు భలే భలే అందాలు సృష్టించేవు భక్త తుకారాం లోని పాట ఆలయాన వెలసిన ఆ దేవుని రీతి దేవత సినిమాలోని పాట ఉదాహరణ లనీ వివరించారు. ముఖ్య అతిథిగా సిండికేట్ బ్యాంక్ విశ్రాంత అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పెరి కామేశ్వర రావు పాల్గొని తమ అభినందనలు తెలిపారు అనంతరం ప్రసన్న, నాగేశ్వర రావు లు ఘంటసాల యుగళ గీతాలు మధురం గా ఆలపించారు.

## వృద్ధాశ్రమాల అభివృద్ధే మా లక్ష్యం

**చిక్కడపల్లి డిసెంబర్ 5 ప్రభాతవార్త :** మార్కండేయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వయోవృద్ధులు ఉంటున్న నివాస ప్రాంతాలను పునరుద్ధరించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీదేవి వివరించారు. ఇందులో భాగంగా గురువారం నగరంలోని వివిధ వయవృద్ధాశ్రమాలను సందర్శించడం జరిగిందని, లహరి ఓల్డ్ ఏజ్ హోమ్ లో ఈ విధంగా అసౌకర్యాలను గుర్తించామని వివరించారు. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమాలను, విశ్రాంతి గదులను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, ఆశ్రమాలలో ఉంటున్న వృద్ధులకు ఎటువంటి అసౌకర్యాలు కల్పించకుండా తోడ్పాటును అందిస్తున్నామని వివరించారు. ఎవరైనా దాతలు ముందుకు వచ్చి తమ ఫౌండేషన్కు సహకరించాలని ఉంటే 8686515327 ద్వారా సంప్రదించవచ్చునని వివరించారు. తమ ఫౌండేషన్ వివిధ ప్రాంతాల్లో ఉన్న వృద్ధాశ్రమాలకు సందర్శించడం జరిగిందని అక్కడ ఉచితంగా, తక్కువ చెల్లింపు తో కూడిన సదుపాయాలను, విశ్రాంతి గదుల ను మంచి వాతావరణాన్ని కల్పించడంతోపాటు విరిగిన పలకలు తదిత సౌకర్యాలను కల్పిస్తున్నామని వివరించారు. వయవృద్ధాశ్రమాలలో మంచినీరు శుద్ధి చేసే పరికరాలు, వారికి అనువైన వాతావరణం కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

## మహిళలపై హింసను అరికట్టాలి


అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టిన మహిళలు

**సైఫాబాద్, డిసెంబరు 5 ప్రభాతవార్త:** ప్రపంచ వ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా చైతన్య మహిళా సంఘం, ప్రజా సంఘాలకు చెందిన మహిళలు గురువారం ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా చైతన్య మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జ్యోతి మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి ఇచ్చిన పిలుపు మేరకు నవంబరు 25వ తేదీ నుంచి డిసెంబరు 10వ తేదీ వరకు ప్రపంచ మానవ హక్కుల దినం వరకు ప్రపంచ వ్యాప్తంగా మహిళలపై జరుగుతన్న హింసకు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా తాము నిరసన ప్రదర్శన చేపట్టడం జరిగిందన్నారు. మహిళల హక్కులన్ని మానవ హక్కులేనని, మహిళలపై జరుగుతున్న హింసను ప్రతి ఒక్కరూ ఖండించాలని, హింసను రూపుమాపడానికి ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు శ్రీదేవి, సత్య, గిరిజ, సవిత, తిరుమల, విరసం ప్రతినిధులు జయ, సత్యం పాల్గొన్నారు. ఫైల్‌నేమ్5చందానగర్ జోన్‌వార్తలు 2

## బాధితులకు అండగా సిఎంఆర్ఎఫ్ : జగదీశ్వర్‌గౌడ్


సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందిస్తున్న జగదీశ్వర్ గౌడ్

**శేరిలింగంపల్లి, డిసెంబర్ 5 ప్రభాతవార్త:** నిరుపేదలకు, రోగగ్రస్తులకు, బాధితులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని శేరిలింగంపల్లి కాంగ్రెస్‌పార్టీ నియోజక వర్గ ఇంచార్జి వి.జగదీశ్వర్ గౌడ్ అన్నారు. శేరిలింగంపల్లి నియోజక వర్గం పరిధిలోని అనారోగ్య కారణాలతో చికిత్స పొందిన బాధితులకు శేరిలింగంపల్లి కాంగ్రెస్‌పార్టీ నియోజక వర్గ ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్ చేతుల మీదుగా ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. కూకట్‌పల్లిడివిజన్ దీనబంధుకాలనీకి చెందిన బేగరి సరోజ (53) శివనగర్‌లో నివాసముంటున్న తమ్మలి శ్రీనివాస్ (48) అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరి చికిత్స అనంతరం కూకట్‌పల్లి లోని జీవీఆర్ కార్యాలయంలో కాంగ్రెస్‌పార్టీ నేత గొట్టుముక్కల వెంకటేశ్వరావును సంప్రదించగా శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్ ద్వారా బాధితురాలు సరోజకు 60వేల రూపాయలు, శ్రీనివాస్‌కు 45వేల రూపాయల సీయం రిలీప్ ఫండ్ చెక్కులను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు, రోగులకు భరోసాగా ఉంటుందన్నారు. ముఖ్యంగా ఆనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి కొంతమేరకు ఆర్థిక సహాయాన్ని అందించి వారిని ఆదుకునేందుకు సీఆర్ఆర్ఎఫ్‌ద్వారా తమవంతు కృషిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు దత్తులూరు ఆశోక్, మాచర్ల విష్ణు, రఘుగౌడ్, శంకర్‌రావు, పరశురాం, అరున్, రాహుల్ గైక్వాడ్, తదితరులు పాల్గొన్నారు.


బేగంపేట్ ప్రకాష్ నగర్ వద్ద ఫుట్‌పాత్‌పై ఉన్న అక్రమ డబ్బులను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

## సిసి కెమెరాల ఏర్పాటు ఎంతో అవసరం : నార్త్‌జోన్ డిసిపి


మోతీలాల్ నెహ్రూనగర్ లో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న నార్త్‌జోన్ డీసీపీ సాధన రష్మీపెరుమాళ్.

**బేగంపేట డిశంబరు5,ప్రభాతవార్త :** కాలనీలు, బస్తీలు, పాఠశాలలు, ఆసుపత్రులు ముఖ్యమైన రద్దీ ప్రాంతాలు ఇలా ప్రతి ఒక్క చోట సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం బద్రత పరంగా ఎంతో అవసరమని నార్త్‌జోన్ డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ అన్నారు. గురువారం బేగంపేట పోలీసు స్టేషన్ పరిధిలోని మోతీలాల్ నెహ్రూ నగర్, ఎస్ బి ఐ కాలనీ లో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 27 సీసీ కెమెరాలను డీసీపీ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ మాట్లాడుతూ బధ్రతా కారణాల దృష్ట్యా ప్రతి ఒక్క బస్తీ, కాలనీల అసోసియేషన్లు ఇలా ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నట్లైతే నేరాల నియంత్రణకు సాధ్యమవుతుందని ఆమె అన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల కలిగే ప్రయోజనాలను ఈ సందర్భంగా కాలనీ వాసులకు డీసీపీ వివరించారు. కాలనీ వాసి విశాల్ సుధాం మాట్లాడుతూ తమ కాలనీలో ఇది మొదటి అడుగు ప్రజాపాలన వార్షికోత్సవాన్ని జరుపుకోవడానికి తీసుకున్న నిర్ణయంగా పేర్కొన్నారు. ఇది కాలనీ లోని ప్రజల బధ్రతను దృష్టిలో ఉంచుకొని ఏర్పాటు చేసామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ గోపాల కృష్ణమూర్తి, సీఐ చిర్ర రామయ్య, ఎస్సై శ్రీధర్, కాలనీ అధ్యక్షులు రవీంద్ర, జయశ్రీ, నంగునూరి చంద్రశేఖర్, శ్రీసాయిరామ్, అమిత్ మరియూ కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

## మాలలు మనువాదులయితే, మాదిగలు కమ్యూనిస్ట్ లా?

**-మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు తల్లమల్ల హసేన్**

**చిక్కడపల్లి డిసెంబరు 5 ప్రభాతవార్త ;** మాలలు మనువాదులు అని మందకృష్ణ మాదిగ ఆరోపించటం సిగ్గుచేటని, అవగాహన లేకుండా మాట్లాడటం మంచిది కాదని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు, పూర్వ ప్రభుత్వ న్యాయవాది తల్లమల్ల హసేన్ పేర్కొన్నారు. మాల కులాలు మనువాదులు కాదని వారు నిజమైన అంబేద్కర్, పూలే వారసులని, మంద కృష్ణ మాదిగ మనువుకు నిజమైన వారసుడని అన్నారు. గురువారం తల్లమల్ల హసేన్ మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ గురించి మొత్తం తెలుసుకొని మాన్యశ్రీ కాన్షిరాం మంద కృ ష్ణఆపాట్మెంట్ కూడ ఇవ్వలేదు. తన పాలక వర్గాల పాలక పార్టీల కమ్యూనిస్టుల తప్పుడు లెక్కలతో, ఆశాస్త్రీయ, నయాన వాదనలతో వివిధ పార్టీలను సమాజాన్ని తప్పుదోవ పట్టిస్తూ వర్గీకరణ పేరుతో మాదిగ జాతిని వాడుకుంటున్నావు. బిజెపి, ఆర్ఎస్ఎస్, మనువాద, మతవాద పార్టీల పంచన చేరి మాలలను మనువాదులు అనడం అని ఎద్దేవా చేస్తున్నారు. మంద కృష్ణ బిజెపి, కాంగ్రెస్, తెలుగుదేశం, టిఆర్ఎస్ పార్టీ నాయకులతో మిలాకత్ఐ ఇప్పుడు మాలలను మనువాదులని పేర్కొనటం అర్థరహితమన్నారు. వందల ఏళ్ల నుంచి కలిసిమెలిసి జీవిస్తున్న మాల మాదిగల నడుమ మందకృష్ణ మాదిగ చిచ్చు పెడుతున్నాడని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే వివేక్ మూడు పార్టీలు మారింది విమర్శించటం తగదన్నారు. పార్టీలు మారిన కులం మారదు కదా అని గుర్తు చేస్తున్నాం, . ఎస్సీ వెనుక బడిన కులాలను అభివృద్ధి లోకి తీసుకొని రావడానికి మాలలు వ్యతిరేకం కాదని, వారికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేయాలని, . మాలకులాల సంఖ్య రాష్ట్రము లో రెండవ స్థానం ఉందని, చెప్పడానికి, చూపించడానికి మా బల ప్రదర్శన కు ఈ సభను నిర్వహించామని అన్నారు. మాలలను కులపరంగా వ్యక్తిపరంగా ఇతర కులాల నాయకులను గౌరవించినట్టు గౌరవించాలని పేర్కొన్నారు. మాలల పైన పెత్తనం చేసినట్లు నియంతృతంగా మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు.

## బహుముఖ ప్రజ్ఞాశీలి ఎస్.కె.మిశ్రో : డా. కె.వి.రమణాచారి


ఎస్.కె.మిశ్రోను ప్రతిభా పురస్కారంతో సత్కరిస్తున్న రమణాచారి, కృష్ణయ్య, సుబ్బరాయశర్మ, నటరాజ్, మోహనసేనావతి, కామేశ్వరరావు తదితర అతిథులు

**హైదరాబాద్ (నాంపల్లి), డిసెంబరు 5 ప్రభాతవార్త :** ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రఖ్యాత రంగస్థల, టీవి, చలన చిత్ర నటుడు, దర్శకుడు, రచయిత, బహుముఖ ప్రజ్ఞాశాలి 80ఏళ్ల సునీల్‌కుమార్ మిశ్రో అని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, రసరంజని అధ్యక్షుడు డా. కె.వి. రమణాచారి అన్నారు. మిశ్రో విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, ఉత్తర తెలంగాణ తదితర తెలుగు ప్రాంతాల్లో విశ్వప్రభావితమైన వ్యక్తి అని ఆయన గుర్తుచేశారు. ఆధునిక నాటక సరికొత్త దిశానిర్దేశిగా లబ్ధప్రతిష్టులైన డా. చాట్ల శ్రీరాములు నాటకానికి ప్రయోగపు రంగులద్ది, రూప పరిణామానికి కొంగ్రొత్త శ్రీకారం చుట్టారని కొనియాడారు. ప్రముఖ సాంస్కృతిక సంస్థ రసరంజని, హైదరాబాద్, చాట్ల శ్రీరాములు థియేటర్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో 1999 నుండి ప్రతీసంవత్సరం చాట్ల శ్రీరాములు జయంతి వేడుకలను పురస్కరించుకొని నాటకరంగ విశిష్టులకు ప్రతిభా పురస్కారం ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో బొల్లినేని కృష్ణయ్య సభాధ్యక్షతన నిర్వహించిన చాట్ల శ్రీరాములు 93వ జయంతి వేడుకల్లో ముఖ్యఅతిథిగా విచ్చేసిన విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి విశిష్ట అతిథులు యు.సుబ్బరాయశర్మ, బి.సాయిమాధవ్, జగన్నాధశర్మ, రసరంజని నటరాజ్, మోహనసేనాపతి, కామేశ్వరరావు తదితరులతో కలిసి ఎస్.కె.మిశ్రోను ఘనంగా సత్కరించి ప్రతిభా పురస్కారం, 20వేల రూపాయల నగదు బహుమతి అందజేసి అభినందించారు. వచ్చే సంవత్సరం నుండి బొల్లినేని కృష్ణయ్య సూచన సహకారంతో 50వేలకు పెంచుతున్నట్లు రమణాచారి ప్రకటిస్తూ కృష్ణయ్య కృతజ్ఞతలు తెలిపారు. సభకు ముందు అక్కల కామేశ్వరయ్య రచన, వడ్డాది సత్యనారాయణ దర్శకత్వంలో ప్రస్తుత సమాజానికి అద్దంపట్టే సందేశాత్మక నాశత్రువు నాటిక అద్భుతంగా ప్రదర్శింపబడి ప్రేక్షకుల ప్రశంసలందుకుంది. ఈ నాటకానికి పారితోషికంగా 50వేల రూపాయలు అందించడం విశేషం.

## కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేశాం : రాంబాబు యాదవ్


కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ సునీత గోపాల్ దాస్‌కు నామినేషన్ పత్రాలను అందజేస్తున్న రాంబాబు యాదవ్

**చిక్కడపల్లి డిసెంబరు 5,ప్రభాతవార్త :** కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేశామని, కార్మికులకు ఇచ్చిన హామీ అమలు చేశామని వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణ (డబ్ల్యు, డబ్ల్యు, ఈయూటీ) అధ్యక్షుడు, బీఆర్ టీయూ అధ్యక్షుడు రాంబాబు యాదవ్ అన్నారు. వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ గుర్తింపు ఎన్నికలకు గాను యూనియన్ అధ్యక్షుడిగా రాంబాబు యాదవ్, ప్రధాన కార్యదర్శిగా ఎం.మల్లయ్యలు గురువారం కార్మిక శాఖ కార్యాలయంలో జంటనగరాల కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ సునీత గోపాల్ దాస్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా రాంబాబు యాదవ్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవిత, గౌరవ అధ్యక్షుడు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి సారథ్యంలో రెండు సార్లు గెలిచి కార్మికులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని అన్నారు. కార్మికులు సంక్షేమం కోసం చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. కాంగ్రెస్ అనుబంద యూనియన్ నేడు కార్మికలను భయబ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. అధికార పార్టీలో ఉంటే పనులు అవుతాయని బ్రమలో పడుతున్నారని వివరించారు. కార్మికులకు హెల్త్ కార్డు అందించామని, ప్రొమోషన్ల సమస్యను పరిష్కరించాము, పీఆర్ఎస్ ధర్నాలకు లేకుండా సాధించుకున్నామని, అక్రమ బదిలీలకు అడ్డుకట్ట వేయడం జరిగిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన సౌకర్యాలను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించకుండా రద్దు చేసే కుట్ర చేస్తోందని తెలిపారు. ఇలాంటి సందర్భంగా మరోసారి కార్మికులు ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జి. లక్ష్మీనారాయణ, మేడ్చల్ శ్రీనివాస్, కోకపేట జంగయ్య, జమీల్ అహ్మద్, రామచంద్రారెడ్డి, వెంకటేశ్ యాదవ్, కిషన్, గ్యానేశ్వర్, రాజ్ కుమార్ , శ్రీనివాస్ రెడ్డి, ఉదయ్, కమార్, రామస్వామి, నిరంజన్, శివారెడ్డి, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నిస్వార్థ సేవా పాలనాదక్షుడు పిఎల్ సంజీవ రెడ్డి

**-తమిళనాడు పూర్వ గవర్నర్ రామ్మోహన్ రావు**


డాక్టర్ పిఎల్ సంజీవ రెడ్డి స్మారక పురస్కారం సమైక్య ఆంధ్ర ప్రదేశ్ తొలి డైరక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ జాస్తి వెంకటరాముడు కు ప్రదానం చేసిన దృశ్యం

**చిక్కడపల్లి డిసెంబరు 5 ప్రభాతవార్త :** ఉన్నత స్థాయిలో సమైక్య ఆంధ్ర ప్రదేశ్ లో పని చేసిన పి ఎల్ సంజీవ రెడ్డి నిస్వార్థ సేవా పాలనా దక్షుడు అని తమిళ నాడు పూర్వ గవర్నర్ పి ఎస్. రామమోహన రావు కొనియాడారు. ప్రముఖ సాంస్కృతిక సంస్థ రసమయి నిర్వహణ లో డాక్టర్ పి ఎల్ సంజీవ రెడ్డి స్మారక పురస్కారం సమైక్య ఆంధ్ర ప్రదేశ్ తొలి డైరక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ జాస్తి వెంకట రాముడు కు ప్రదానోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న రామ మోహన్ రావు పురస్కారం బహుకరించి మాట్లాడారు. సంజీవ రెడ్డి సృజనాత్మక ఆలోచన పరుడు అని అయన సూచనతోనే బసవరామ తారకం క్యాన్సర్ హాస్పిటల్ ఏర్పాటు జరిగిందని తెలిపారు పురస్కారం అందుకున్న రాముడు పోలీస్ శాఖ లో సమర్థ వంతం గా పనిచేసి పోలీసుల నైతిక బలానికి దోహదం చేశారు అని అభినందించారు. వేదిక పై విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చందరకుమార్ , నరసింహ ప్ప తదితరులు పాల్గొనగా డాక్టర్ రాము స్వాగతం పలికారు చివరగా పైడీ సందీప్ కృష్ణ వందన సమర్పణ చేశారు తొలుత అశాలత వ్యాఖ్యానం లో కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది

## దివ్యాంగుల పట్ల బాధ్యతగా మెలగాలి

**-ఎంఈఓ శంకర్ రాథోడ్**



**అత్తాపూర్ డిసెంబరు5,ప్రభాతవార్త :** వైకల్యం ఉన్న వ్యక్తుల పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని ఎంఈఓ శంకర్ పేర్కొన్నారు. గురువారం రాజేంద్రనగర్ లోని భవిత పాఠశాలలో ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ శంకర్ రాథోడ్ హాజరై మాట్లాడారు...దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగుతూ సకలాంగులు అందరిలో సమానంగా రాణించాలని తల్లిదండ్రుల సూచనల పాటించాలని తెలిపారు. దివ్యాంగుల పట్ల వివక్ష చూపకుండా వారికి చేయూతనిచ్చి ఆసరంగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రదానోపాధ్యాయులు సుగుణ, పాఠశాల సిబ్బంది శ్రీనివాస్, యాదగిరి, సీతయ్య, హనుమంతు రావు, స్పెషల్ టీచర్స్ స్వపలు పాల్గొన్నారు.

## స్కాలర్‌షిప్‌లు, ఫీజుల రీయంబర్స్‌మెంట్ చెల్లించాలి

**-10న జిల్లా కలెక్టరేట్లు, ఆర్‌డిఓ, ఎంఆర్ఓ కార్యాలయాలు ముట్టడి**
**-జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరిక**



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య. చిత్రంలో వేముల రామకృష్ణ, నీల వెంకటేశ్ తదితరులు

**సైఫాబాద్, డిసెంబరు 5 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల10న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్లు, ఆర్‌డిఓ, ఎంఆర్ఓ కార్యాలయాల ముట్టడి చేపడుతున్నామని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర బిసి విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముట్టడిలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. గత మూడు సంవత్సరాలుగా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు చెల్లించడం లేదని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నప్పటికి ఒక్క రూపాయి కూడా స్కాలర్‌షిప్‌ల కోసం విడుదల చేయలేదని ఆరోపించారు. కాంట్రాక్టర్ల బిల్లుల కోసం ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు బిల్లులు చెల్లిస్తున్నదని, విద్యార్థులకు మాత్రం స్కాలర్‌షిప్‌లకు డబ్బులు చెల్లించడం లేదని, రాష్ట్రఆర్థిక శాఖ మంత్రికి కాంట్రాక్టర్లు అంటే ప్రేమ ఉంది కాని విద్యార్థులంటే పట్టించుకోవడం లేదని, మంత్రి తన వైఖరిని మార్చుకోవాలని లేని పక్షంలో విద్యార్థుల నుంచి తీవ్రంగా తిరుగుబాటు తప్పదని ఆయన హెచ్చరించారు. గత నాలుగు నెలలుగా విద్యార్థులు స్కాలర్‌షిప్‌లు, ఫీజుల రీయంబర్స్‌మెంట్ కోసం రోడ్ల మీదకు వచ్చి ఆందోళనలు చేపట్టారని, చివరికి తరగతులు బహిష్కరించి, బంద్‌లు చేపట్టారని కాని ప్రభుత్వానికి బుద్ధిరాలేదని విమర్శించారు. బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టి విద్యార్థులకు చదువు రాకూడదనే ఉద్దేశం, అసూయతో కొంత మంది ఉన్నతాధికారులు సిఎం రేవంత్‌రెడ్డికి లేనిపోని మాయ మాటలు చెప్పి ఫీజుల రీయంబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేయడానికి కుట్ర పన్నుతున్నారని ఆర్.కృష్ణయ్య ఆరోపించారు. ఈ పథకం జోలికి వస్తే రాష్ట్ర అగ్నిగుండంగా మారుతుందని హెచ్చరించారు. తక్షణమే స్కాలర్‌షిప్‌లు, ఫీజుల బకాయిలు 4 వేల కోట్లు విడుదల చేయాలని, కాలేజి విద్యార్థులకు ఏడాది 20 వేల రూపాయలు స్కాలర్‌షిప్‌లు ఆయన డిమాండ్ చేశారు. వేముల రామకృష్ణ మాట్లాడుతూ ఇప్పకైన సిఎం రేవంత్‌రెడ్డి విద్యార్థుల విషయంలో జోక్యం చేసుకోవాలని, విద్యా శాఖకు మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిసి నాయకులు నీల వెంకటేష్, గోరిగే మల్లేష్, సి.రాజేందర్, జిల్లపల్లి అంజీ తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ 2030 ట్రాన్స్‌ఫార్మింగ్‌లో ప్రసంగించిన రవీందర్‌యాదవ్



కేరళలోని టైకాన్ కార్యక్రమంలో కేటీఆర్‌తో కలిసి పాల్గొన్న రవీందర్‌యాదవ్

**శేరిలింగంపల్లి, డిసెంబర్ 5 ప్రభాతవార్త** హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దిన ఘనత కేటీఆర్‌దేనని శేరిలింగంపల్లి నియోజక వర్గం బీఆర్ఎస్ సీనియర్ నేత రవీందర్‌యాదవ్ అన్నారు. టైకాన్ కేరళ కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి శేరిలింగంపల్లి బీఆర్ఎస్ సీనియర్ నేత రవీందర్‌యాదవ్ హజరయ్యారు. టైకాన్ కేరళ సభ్యునిగా ఉన్న రవీందర్‌యాదవ్, కేటీఆర్‌తో కలిసి పాల్గొవడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మిషన్ 2030 ట్రాన్స్‌ఫార్మింగ్ కేరళ పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో రవీందర్‌యాదవ్‌కు ప్రసంగించే అవకాశం దక్కింది. పేదల అభ్యున్నతికి తీసుకోవాల్సిన చర్యలపై ఆయన ప్రంగించారు. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణలో జరిగిన అభివృద్ధిని చేసి పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థలు నిర్వహిస్తున్న కార్యక్రమాలకు కేటీఆర్‌ను ముఖ్యఅతిథిగా ఆహ్వానిస్తున్నారని తెలిపారు. అదే బిఆర్ఎస్ పాలన జరిగిన అభివృద్ధికి నిదర్శనమన్నారు. అధికారంలో ఉన్నా.. లేకున్నా.. సామాన్య ప్రనజల కోసం అభివృద్ధి సంక్షేమంపై నిరంతరం సూచనలు చేస్తు కేటీఆర్ ఎప్పుడూ ముందుంటారన్నారు. తెలంగాణలో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోనికి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కేటీఆర్ మున్సిఫల్, ఐటీ శాఖ మంత్రిగా హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దారని కొనియాడారు. ప్రజలు కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనను పోల్చి చూసుకుంటున్నారన్నారు. రానున్న రోజులల్లో ఏ ఎన్నికలు జరిగినా బీఆర్ఎస్‌దే విజయమని రవీందర్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు.

## ప్రజాపాలన విజయోత్సవాలను విజయవంతం చేయండి


సమావేశంలో పాల్గొన్న బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్

**చార్మినార్, డిసెంబరు 5 ప్రభాతవార్త :** పాతనగరంలో కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్ అన్నారు. దూద్‌బౌలిలో గురువారం జరిగిన కార్యక్రమంలో పులిపాటి రాజేష్ కుమార్ ఇటీవల జరిగిన యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో విజయం సాధించిన బహదూర్‌పుర నియోజకవర్గానికి చెందిన హైదరాబాద్ జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు జ్యోతి శెట్టి, ప్రధాన కార్యదర్శి ఇబ్రహీం, బహదూర్‌పుర నియోజకవర్గం యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు భాను చందర్, అరవింద కొర్రపల్లి, మహమ్మద్ జహంగీర్, కార్యదర్శి విక్కీ సింసింగ్, చాంద్రాయణగుట్ట నియోజకవర్గం యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మహ్మద్ అజీమ్‌లను శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా రాజేష్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రైసింగ్ పేరుతో నిర్వహిస్తున్న విజయోత్సవ సంబరాలలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతీ ఒక్కరికి చేరుకునే కృషి చేయాలని తెలిపారు. డిసెంబరు నెల 7వతేదీన చారిత్రక చార్మినార్ వద్ద జరగనున్న వేడుకలకు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు హాజరవుతున్నారని ఆయన తెలియజేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు మహ్మద్ అబేద్ అలీ, జాకీర్ హుస్సేన్, మహ్మద్ బారీఖాన్, శ్రీకాంత్, రామకృష్ణలు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి పాటల ఆడియో ఆవిష్కరణ


కార్యక్రమంలో పాల్గొన్న రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి

**మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబరు 5 ప్రభాతవార్త :** గొలిదొడ్డి ప్రాంతం అయ్యప్ప స్వాములు నిర్మాత ప్రభాకర్ గురుస్వామి జెడిఎల్ఎస్ బ్రదర్స్, ఆరాధ్య ప్రొడక్షన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ అయ్యప్ప స్వామి వారి పాటల ఆడియోని రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యాదగిరి గురు స్వామి, లక్ష్మణ్ గురు స్వామి, ప్రసాద్ గురు స్వామి, కృష్ణ గురు స్వామి, పరమేష్ గురు స్వామి, సుధాకర్ శ్రీనివాస్ యాదవ్, మహేష్, సూర్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

## రాష్ట్రాన్ని పాలించే అర్హత కాంగ్రెస్‌కు లేదు

**-బిజెపి నేతలు యెండల లక్ష్మీనారాయణ, డాక్టర్ గౌతమ్‌రావు**


చప్పల్‌బజార్‌లో జరిగిన బహిరంగసభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, చిత్రంలో డాక్టర్ గౌతంరావు, కృష్ణాయాదవ్, జి.ఆనంద్‌గౌడ్ తదితరులు

**హైదరాబాద్, డిసెంబరు 5 ప్రభాతవార్త** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీ నారాయణ, ఆపార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు విమర్శించారు. గురువారం సాయంత్రం కాచిగూడలోని చెప్పులబజార్ లో నిర్వహించిన బహిరంగ సభలో యెండల లక్ష్మీ నారాయణ, గౌతమ్ రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలనను కొనసాగిస్తుందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఏ మాత్రం అభివృద్ధి చెయ్యడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో ఒక్క నిమిషం కూడా పాలించే అర్హత లేదని విమర్శించారు. ఈ సమావేశం లో మాజీ మంత్రి కృష్ణ యాదవ్, ఒబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్, పార్టీ సీనియర్ నేతలు అజయ్, కన్నె రమేష్‌యాదవ్, కృష్ణ గౌడ్, శ్యాంరాజ్, వినోద్ యాదవ్, సూర్య ప్రకాష్ సింగ్, నంద కిషోర్, కార్పోరేటర్లు, ఎన్.అమృత, కన్నె ఉమారమేష్‌యాదవ్, డా. సమత పాల్గొన్నారు.

## ప్రపంచ నేల దినోత్సవం నిర్వహించిన పిసిబి


విద్యార్థులతో క్విజ్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

**హైదరాబాద్, డిసెంబరు 5 ప్రభాతవార్త** తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ నేల దినోత్సవం వేడుకలు నిర్వహించింది. ఈ సందర్భంగా "నేలల సంరక్షణ అంశంపై పలు కార్యక్రమాలు నిర్వహించింది. ఈ సందర్భంగా శంషీర్‌గంజ్‌లోని శారద డిగ్రీ, జూనియర్ కళాశాల విద్యార్థులతో పలు కార్యక్రమాలు నిర్వహించింది. ప్రపంచ కాలుష్యం, వ్యర్థాల నిర్వహణ, నేల సారం క్షీణత, నేలకోత, కాలుష్యం నుండి రక్షించే పద్ధతుల గురించి విద్యార్థులకు క్విజ్ కార్యక్రమంతో పాటు ఆయా అంశాలపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పిసిబి పాజెక్ట్ ఆఫీసర్ బి.నాగేశ్వరరావు మాట్లాడుతూ భూసార పరిరక్షణ ప్రాముఖ్యత, నేల సారం క్షీణత, పర్యావరణ ఆరోగ్యంలో నేల పాత్ర, నేల సారంపై పట్టణీకరణ ప్రభావాన్ని తగ్గించే మార్గాల గురించి విద్యార్థులకు వివరించారు. పర్యావరణ పరిరక్షణ, నేల నిర్వహణలో సుస్థిరమైన పద్ధతులకు సహకరించేలా యువ తరాన్ని ప్రేరేపించడం లక్ష్యంగా పెట్టుకుంది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జూనియర్ కళాశాల పి.పద్మావతి, డిగ్రీ కళాశాల ఎస్.లలిత, విద్యార్థులు పాల్గొన్నారు.

## హాషిష్ అయిల్ పట్టివేత

**శేరిలింగంపల్లి, డిసెంబర్ 5 ప్రభాతవార్త** నగర శివార్లలోని చందానగర్ రైల్వేస్టేషన్ సమీపంలో హాషిష్ అయిల్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఒరిస్సా ప్రాంతం నుంచి హైదరాబాద్‌కు హాషిష్ అయిల్‌ను తరలిస్తున్నారనే సమాచారం మేరకు స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ( ఎస్‌టీఎఫ్ ఏ) టీం తనిఖీ నిర్వహించారు. చందానగర్ రైల్వేస్టేషన్ సమీపంలో అనుమాస్పదంగా ఉన్న కారునునిలిపి వేసి స్పెషల్ టాస్క్ ఫోర్స్ టీం తనిఖీలు నిర్వహించారు. కాగా కారులో గుట్టుచప్పుడు కాకుండా ఇద్దరు వ్యక్తులు 1.5 కేజీల హాషిష్ అయిల్‌ను తరలిలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. తనిఖీల్లో పట్టుబడిన అయిల్ విలువ దాదాపు 5లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. హాషిష్ అయిల్‌ను తరలిస్తున్న కారును సీజ్ చేసి, ఇద్దరిని అదుపులోనికి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్ సమయం పెంచాలి

**మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబరు 5 ప్రభాతవార్త :** దుర్గానగర్ చౌరస్తాలో ఆరామ్‌ఘర్ వైపు వాహనాలు యూటర్న్ తీసుకుంటున్న సమయంలో సిగ్నల్ సమయాన్ని పెంచాలని కోరుతూ బిజెపి నాయకులు నవారు మురళీధర్ రెడ్డి రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌ను కలిసి వినతి పత్రం అందజశారు. ట్రాఫిక్ లైట్లల్లో సెకన్ల గణన ప్రదర్శన కనిపించక పోవటంతో వాహనదారులు ప్రయాణం చేయటం వల్ల తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని, రెడ్ సిగ్నల్ పడినా వాహనదారులు వెళుతుండటం వల్ల గ్రీన్ సిగ్నల్ వైపు వెళుతున్న వాహనదారులు ఇబ్బందులకు గురివుతున్నారని ఆయన ట్రాఫిక్ పోలీసులు అంద జేసిన వినతి పత్రంలో పేర్కొన్నారు. ప్రధానంగా బాబుల్‌రెడ్డి నగర్ నుంచి ఆరాంఘర్ చౌరస్తా వైపు వెళ్లే వారికి సిగ్నల్ సంఖ్య లేక పోవటం వల్ల ఇబ్బంది పడుతున్నారని మురళీధర్ రెడ్డి ట్రాఫిక్ పోలీసులకు వివరించారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, వామహేందర్ రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

## నేరాల కట్టడికి సిసి కెమేరాలు ఎంతో అవసరం

**-డిసిపి రష్మిపెరుమాల్**



ఓల్డ్ బోయిన్‌పల్లిలో సిసి కెమేరాలను ఆవిష్కరిస్తున్న డిసిపి రష్మిపెరుమాల్ తదితరులు

**కంటోన్మెంట్,డిసెంబర్ 5 ప్రభాతవార్త:** శాంతి భద్రతల పరిరక్షణకు,నేరాల అదుపుకకు సీసీకెమరాలు ఎంతో అవసరమని ఉత్తర మండలం డిసిపి సాదన రష్మిపెరుమాల్ తెలిపారు. గురువారం ఓల్డ్ బోయిన్‌పల్లి వెస్లీ టీచర్స్‌కాలనీ, స్వయంబు శ్రీ ప్రసన్న బాలంజనేయ దేవాలయంలో ఏర్పాటు చేసిన 32 సీసీ కెమరాలను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఏసిపి గోపాల క్రిష్ణమూర్తి, బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మి నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### అయ్యప్ప స్వామికి అకుంఠిత దీక్షతో పూజలు : జంపనప్రతాప్

**కంటోన్మెంట్,డిసెంబర్ 5 ప్రభాతవార్త:** అయ్యప్ప మాలాదారణ ధరించిన స్వాములు,శారీరకంగా, మానసికంగా పవిత్రంగా ఉండి అకుంఠిత దీక్షతో పూజలు నిర్వహిస్తారని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. గురువారం 1వ వార్డు కడక్‌పురాలోని మార్గశిగురు స్వామి ఆధ్వర్యంలో 16వ మహా పడిపూజలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామిని స్మరిస్తూ భజన కీర్తనలు పాడారు. పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. 18 పడి మెట్లకు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మణికంఠ,శ్రీకాంత్, మాధవ్, శేఖర్, శ్రీధర్, వరప్రసాద్, సతీష్,రాము, చరణ్‌లు పాల్గొన్నారు.

### కంటోన్మెంట్‌లో టిడిపిని బలోపేతం చేయాలి : నర్సింగ్‌రావ్

**కంటోన్మెంట్,డిసెంబర్ 5 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ నియోజకవర్గంలో టీడీపిన మరింత బలోపేతం చేయాలని నియోజకవర్గం అడహక్ కమిటీ మెంబర్ జనగాం నర్సింగ్ రావ్ సూచించారు. గురువారం 8వ వార్డులో ఏర్పాటు చేసిన టీడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడిపి నాయకులు సూర్య వంశీ, రాజేశ్, ఫైసుద్దీన్ ఖాన్, రాము, కిరణ్, కపిల్, జేబ్రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు సమన్వయంతో అభివృద్ధి పనులు జరపాలి

**-తలసాని శ్రీనివాస్ యాదవ్**



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**సికింద్రాబాద్, డిసెంబర్ 5 ప్రభాతవార్త:** బండమైసమ్మనగర్‌ను అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. గురువారం బన్సీలాల్‌పేట డివిజన్ బండమైసమ్మనగర్‌లో వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించారు. బస్తీలో నిర్మిస్తున్న సీసీరోడ్డును పరిశీలించారు. స్థానికులను వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో వ్యవహించి అభివృద్ధి పనులు జరపాలని సూచించారు. అలాగే తమ ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి జరుపడం అధికారుల బాధ్యతగానే గానే అనుకోకుండా పనులు సక్రమంగా జరిగే విధంగా చూసుకోవడం స్థానికుల బాధ్యతగా గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలత, డీఎంసీ సమ్మయ్య, అధికారులు ఆంజనేయులు, నేతలు వెంకటేషన్‌రాజు, ప్రేమ్‌కుమార్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ గాంధీ జ్ఞాన్‌ప్రతిష్టాన్, గ్లోబల్‌ఫ్యామిలీ యువజన విభాగ అధ్యక్షుడుగా సంజయ్‌రెడ్డి

**నాంపల్లి, డిసెంబరు 5 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర జ్ఞాన్ ప్రతిష్టాన్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ యువజన విభాగం నూతన కార్యవర్గం ఏర్పడింది. ఈ నూతన కార్యవర్గాన్ని ప్రజాస్వామ్య పద్ధతిలో ఏకగ్రీవం ఎన్నుకున్నారు. యువజన విభాగం అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నికైన కె.సంజయ్‌రెడ్డికి రాష్ట్ర జ్ఞాన్‌ప్రతిష్టాన్, గాంధీ గ్లోబల్‌ఫ్యామిలీ ఛైర్మన్ గున్నా రాజేందర్‌రెడ్డి నియామకపత్రం అందజేసి ఎంతగానో అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కార్యవర్గ సభ్యులకు ఆయన నియామకప్రతాలు అందజేసి ప్రశంసించారు. నేటి ప్రపంచంలో నెలకొన్న సమస్యలు, సంక్లిష్ట పరిస్థితులు, ఉగ్రవాద, హింసాకాండ సంఘటనల నిర్మూలనకి కేవలం గాంధేయ మార్గమే సరైన పరిష్కార మార్గాన్ని చూపుతోందని రాజేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. సమాజంలో శాంతి, సౌభాతృత్వం, సద్భావన, గాంధీ ఆలోచనలు, ఆశయాలకు ప్రతీ ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా యువత సంజయ్‌రెడ్డిని పూలదండలతో ఘనంగా సత్కరించారు. కార్యనిర్వాహక అధ్యక్షుడుగా బోడేపూడి రాజా, ఉపాధ్యక్షుడుగా సాయిచంద్, పులి వెంకటేష్, కార్యదర్శులుగా వెంశెట్టి రాజేందర్, రాజకుమార్, సంతోష్, సుధాకర్‌నాయక్, ఎన్.శంకర్ తదితరులు ఎన్నికైన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్, గాంధీ గ్లోబల్‌ఫ్యామిలీ కార్యదర్శి యానాల ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## అల్లు అర్జున్‌పై కేసు నమోదు చేయాలి

**-మృతురాలి కుటుంబానికి కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలి**

**-ఆమ్ ఆద్మీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్**



చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న ఆమాద్మీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్

**ముషీరాబాద్, డిసెంబర్ 5, ప్రభాతవార్త:** సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాటకు కారణమైన అల్లు అర్జున్‌పై కేసు నమోదు చేయాలని ఆమాద్మీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆయన ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ సెలబ్రిటీ అయిన అల్లు అర్జున్ రోడ్డుపై కారులో నిలబడి తొక్కిసలాటకు, రేవతి మృతికి కారణమయ్యారని అన్నారు. పోలీసులు బందోబస్తులో విఫలమయ్యారని, థియేటర్ యాజమాన్యం రక్షణ చర్యలు తీసుకోకుండా సెలబ్రిటీని పిలిచి తొక్కిసలాటకు కారణమయ్యారని ఆరోపించారు. అల్లు అర్జున్‌మీద, పోలీసుల మీద, థియేటర్ యాజమాన్యం మీద కేసు నమోదు చేసి, దోషులను శిక్షించాలని, మృతురాలి కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాలని, ఎర్ర చందనం మాఫియా సినిమా టిక్కెట్ల ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యువ జన సంఘం రాష్ట్ర అధ్యక్షులు విజయ్ ముల్లంగి, మహిళా సం ఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ యమునాగౌడ్‌లు పాల్గొన్నారు.

## ఆలయ భక్తులకు విఘాతం కలిగిస్తే సహించేది లేదు : ఎమ్మెల్యే శ్రీగణేష్



తాడ్‌బండ్ హనుమాన్ దేవాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కంటోనె్మంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

**కంటోన్మెంట్,డిసెంబర్ 5 ప్రభాతవార్త:** అలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రతి శనివారం యధా విధిగా అర్ధరాత్రి 1 గంట వరకు భజన, సత్‌సంఘ్ కార్యక్రమాలు యధా విధిగా జరుగాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. గురువారం తాడ్‌బండ్‌లో ప్రసిద్ధిగాంచిన వీరాంజనేయ స్వామి దేవాలయంలో దేవదాయ శాఖ జాయింట్ కమీషనర్ రామక్రిష్ణ, బేగంపేట ఏసిపి గోపాల క్రిష్ణమూర్తితో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుష్పగిరి పీఠాధిపతి అభ్యంతరాలు తెలుపడంతో కొంత మంది వ్యక్తులు దుష్ప్రచారం చేశారన్న విషయంపై భక్తులు నమ్మకూడదన్నారు. హిందూ ధర్మం పాటించాలన్నారు. ప్రతి శనివారం రాత్రి ఒంటి గంట వరకు పూజా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. శాంతి భద్రతాలను కాపాడాలని సూచించారు. ప్రతి భక్తునికి స్వామి వారి ఆశీసులు కావాలని కోరారు. శాంతి భద్రతలకు,భక్తులకు అటంకం కలిగించే విధంగా చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ ఏ.నాగేందర్, బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మి నారాయణ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ముప్పిడి మధుకర్, తేలుకుంట సతీష్ గుప్త, శ్యామ్ సుందర్ రెడ్డి, సంకి రవిందర్, నాగినేని సరిత, మురళీ ముదిరాజ్, బల్వం త్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘంటసాల స్వరం చిరస్మరణీయం

**- ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి**



సుబ్బారాయుడు దంపతులను సన్మానించి బిరుదు ప్రదానం చేస్తున్న రమణాచారి, శోభారాజు, సంజయ్‌కిశోర్, నరసింహారావు, రాధాకృష్ణన్ తదితర అతిథులు

**రవీంద్రభారతి, డిసెంబరు 5 ప్రభాతవార్త :** సెలయేరు వంటి సుస్వరం.... సదరాలు, సరాగాలు సంపూర్ణంగా ఘంటసాల గానంలో స్పష్టత, విశిష్టతతో తులతూగుతాయన్న తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి ఈ ప్రపంచంలో పాట ఉన్నంతవరకు ఘంటసాల స్వరం, గానం చిరస్మరణీయంగా ఉంటాయని కీర్తించారు. పద్మశ్రీ శోభారాజు ఎంతోమంది గాయనీగాయకులకు బిక్షపెట్టిన ఘంటసాల అజరామరమైన ఎన్నో కీర్తనలను అందించారని కొనియాడారు. ముందుగా సభకు సంజయ్ కిశోర్ స్వాగతం పలికారు. సాంస్కృతిక సంస్థ సంగమం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షుడు ఎం.సంజయ్ కిషోర్ నిర్వహణలో అమరగాయకుడు పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతి సందర్భంగా రవీంద్ర భారతిలోని సమావేశ మందిరంలో జరిగిన వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. కె.వి.రమణాచారి విశిష్ట అతిథులు ప్రముఖ సినీదర్శకుడు రేలంగి నరసింహారావు, ప్రముఖ సంగీత దర్శకుడు కె.ఎం.రాధాకృష్ణన్, ప్రఖ్యాత ఆధ్యాత్మిక గాయని పద్మశ్రీ డా. శోభారాజు తదితరులతో కలిసి అమరగాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలవేసి ఘననివాళులర్పించి అనంతరం ఘంటసాల గాన పరిశోధకుడు చల్లా సుబ్బారాయుడును ఘనంగా సన్మానించి ఘంటసాల గాన పరిజ్ఞాన విశారద బిరుదును ప్రదానంచేసి ఎంతోగానో అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఘంటసాల పాట, వ్యక్తిత్వం, జీవన విధానం గురించి శతాబ్ది గాయకుడు అనే గ్రంథాన్ని వెలువరించిన చల్లా సుబ్బారాయుడు ఆత్మసంతృప్తి పొందాడని ప్రశంసించారు. సభకుముందు ప్రముఖ గాయని సంయుక్త నిర్వమణలో ఘంటసాల గానలహరి ఆహుతుల్ని తనయుల్నిచేసి సంగీతలోకంలో విహరింపజేశారు.

### అయ్యప్ప పూజలో పాల్గొన్న కొంతం దీపిక



అవుల మందలో పూజలు చేస్తున్న కార్పోరేటర్ కొంతం దీపిక తదితరులు

**అడ్డగుట్ట,డిసెంబర్ 5 ప్రభాతవార్త:** మోండా డివిజన్ ఆవుల మందలోని శ్రీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాలకు డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### కూన శ్రీశైలం గౌడ్‌ను కలిసిన అరుణ్ కుమార్ గౌడ్



అరుణ్ కుమార్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కూన శ్రీశైలం గౌడ్

**పేట్ బషీరాబాద్, డిసెంబర్ 5, ప్రభాతవార్త**

యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుండి ఎన్నికైన నాయకులు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన నల్ల అరుణ్ కుమార్ గౌడ్, 125 డివిజన్ గాజులరామరం యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ షేక్ సల్మాన్‌లకు కూన శ్రీశైలం గౌడ్ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూన రాఘవేంద్ర గౌడ్, బిల్లా వెంకట్, వేణు చింటూ, కార్తీక్, అవినాష్ మాథ్యూస్, భాను, మహేష్, జ్ఞానేశ్వర్, అభిలాష్ బంటి, చింటూ, షేక్ అహ్మద్, సయ్యద్ అక్బర్, లాల్ మహ్మద్, షేక్ మోహిన్, చాంద్ పాషా, అహ్మద్, ఇస్మాయిల్ సోహెల్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల పర్యవేక్షణ కరువు

**-నాసిరకం పనులతో ప్రజాధనాన్ని దోచుకుంటున్న గుత్తేదార్లు..**

**నిజాంపేట్, డిసెంబర్ 5, ప్రభాతవార్త**

అవినీతికి అడ్డాగా మారుతున్న నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రతి పనికి నాకెంత నీకెంత అనే ధోరణిలో నాసిరకంగా పనులను పూర్తి చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లోపం మమ్మల్ని ఎవరు ప్రశ్నిస్తారని నిర్లక్ష్య వైఖరి స్పష్టంగా కనిపిస్తుంది. నిజాంపేటలోని పాత గ్రామపంచాయతీ సమీపంలోని బొడ్రాయి నుండి వాటర్ ట్యాంక్ వరకు డ్రైనేజీ పనులు నిమిత్తం దాదాపు కోటి రూపాయల వ్యయంతో డ్రైనేజీ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కార్పొరేషన్ పరిధిలో గతంలో ఎస్ఎన్‌డిపి పనులు ఏ విధంగానైతే నాశిరకం పనులతో పూర్తి చేయడం జరిగినాయో అదేవిధంగా ఈ డ్రైనేజీ పనులు పూర్తి చేస్తే భవిష్యత్తులో ఇక్కడ ఉన్న కాలనీవాసులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని, ఇప్పటికైనా సంబంధిత డిపార్ట్మెంట్ అధికారులు మొద్దు నిద్ర నుండి మేల్కొని తగిన చర్యలు తీసుకోవాలని భాజపా నిజాంపేట అధ్యక్షులు బిక్షపతి యాదవ్ డిమాండ్ చేశారు.

### కన్నుల పండువగా అయ్యప్ప స్వామి మహాపడి పూజ



శ్రీ అయ్యప్ప స్వామి మహా పడి పూజలో పాల్గొన్న అయ్యప్ప స్వామి భక్తులు

**చార్మినార్,డిసెంబరు 5 ప్రభాతవార్త :** పాతబస్తీ పురానాపూల్‌లో కన్నుల పండువగా శ్రీ అయ్యప్ప స్వామి మహా పడి పూజ కార్యక్రమం జరిగింది.సందీప్ గౌడ్ ఆధ్వర్యంలో పడి పూజోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.శ్రీ అయ్యప్ప స్వాములకు,భక్తులకు అల్పాహార,భోజన వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంఛార్జి పుస్తె శ్రీ కాంత్, మన్సూరాబాద్ గణేష్ గౌడ్,సందీప్ గౌడ్,జయంత్ గౌడ్‌పాల్గొన్నారు.

## శేరిలింగంపల్లి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా జాకీర్ షరీఫ్

**గచ్చిబౌలి, డిసెంబరు 5 ప్రభాతవార్త**

శేరిలింగంపల్లి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా జాకీర్ షరీఫ్ అలియాస్ పటేల్ గెలుపొందారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో శేరిలింగంపల్లి నియోజకర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం పోటీ చేసిన జాకీర్ షరీఫ్ ఘన విజయం సాదించారు. మంగళ వారం విడుదలైన ఫలితాల్లో జాకీర్ షరీఫ్ పటేల్ 550 ఓట్ల మెజారిటీతో తన సమీప అభ్యర్థిపై గెలుపొందారు. ఈ సందర్భంగా జాకీర్ షరీఫ్ మాట్లాడుతూ తాను దశాబ్ద కాలంగా కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తున్నానని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్తు, పార్టీ ఎదుగుదలకు పనిచేస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీని యువతకు మరింత చేరువ చేసేందుకు తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, శేరిలింగంపల్లిలో కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టంగా తీర్చిదిద్దేందుకు తనవంతు పాత్ర పోషిస్తానని అన్నారు. ఎన్నికల్లో తనను గెలిపించిన శేరిలింగంపల్లి నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ నాయకులు, సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

### అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు అరెస్ట్



అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వ్యక్తులను అరెస్ట్ చేసిన గాంధీనగర్ పోలీసులు

**ముషీరాబాద్, డిసెంబర్ 5, ప్రభాతవార్త:** అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేసి, ఎక్కువ ధరలకు విక్రయించేందుకు తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను గాంధీనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ డి.రాజు తెలిపిన వివరాల ప్రకారం ముషీరాబాద్ చెందిన మహ్మద్ సలాద్దీన్ (29), భోలక్‌పూర్‌కు చెందిన మహ్మద్ చాంద్ పాషా(30)లు ఒక ట్రాలీలో బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం రాత్రి బన్సీలాల్ పేట్ కమాన్ వద్ద పట్టుకున్నారు. బియ్యాన్ని తరలిస్తున్న సలాద్దీన్, చాంద్‌పాషాలను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 13.60 క్వింటాళ్ల రేషన్ బియ్యంతో పాటు బియ్యాన్ని తరలిస్తున్న బజాజ్ పియాగో వాహనాన్ని కూడా సీజ్ చేశామని సీఐ తెలిపారు.

### అరుణోదయ 50 వసంతాల ప్రస్థానానికి జేజేలు



ఆహ్వాన సంఘం కరపత్రంను ఆవిష్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి డిసెంబరు 5 ప్రభాతవార్త**

డిసెంబర్, 14,15 తేదీలలో హైదరాబాదులో జరిగే అరుణోదయ సభల సందర్భంగా ముద్రించిన ఆహ్వాన సంఘం కరపత్రమును.. బాగ్ లింగంపల్లి అంబేద్కర్ డిగ్రీ కాలేజీలో ఆవిష్కరించడం జరిగింది.... ఈ కార్యక్రమంలో అరుణోదయ సంస్కృతిక సమాఖ్య జంట నగరాల ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ రావణ్ రాకేష్ మాట్లాడుతూ భారత విప్లవోద్యమంలో అరుణోదయ పాత్ర కీలకమైనవి అని అన్నారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో భాగంగా గిగినీ నిర్వహించిన అనేక మిలిటెంట్ ఉద్యమాల్లో పాల్గొని నిర్బంధాన్ని సైతం ఎదుర్కొన్నది అన్నారు ప్రత్యేక రాష్ట్రం కోసం గలమెత్తిన విమలక్కను అప్పటి ప్రభుత్వం దాదాపు మూడు నెలలు జైల్లో నిర్బంధించి ఉంచింది అన్నారు, ఈ కార్యక్రమంలో కాలేజీ విద్యార్థులు కామ్రేడ్ సురేష్, అక్షయ, మానస, భవాని, శివాని రెడ్డి, ప్రీతి, శరత్ తదితరులు పాల్గొన్నారు.

## బాంగ్లాదేశ్ మైనార్టీలపై హింసాకాండకు నిరసనగా న్యాయవాదుల ధర్నా



బాంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న హింసాకాండకు నిరసనగా రంగారెడ్డి జిల్లా కోర్టు వద్ద ధర్నా చేస్తున్న న్యాయవాదులు

**హైదరాబాద్, డిసెంబరు 5 ప్రభాతవార్త**

బాంగ్లాదేశ్‌లో మైనార్టీ హిందువులపై దాడులు చేస్తూ, ఆస్తులను కొల్లగొడుతూ, హింసకాండకు పాల్పడుతున్న వారిపై ఆ దేశ ప్రధాని ఎలాంటి చర్యలు తీసుకుపోకపోవడాన్ని నిరసిస్తూ రంగారెడ్డి జిల్లా కోర్టు ప్రవేశద్వారం వద్ద న్యాయవాదులు తమ నిరసనను వ్యక్తపరుస్తూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కన్వీనర్ తోట జస్వంత్ కుమార్ మాట్లాడుతూ బాంగ్లాదేశ్‌లో హిందువులపై కొనసాగుతున్న దౌర్జన్యాలపై మన రాష్ట్రంలో, దేశంలో రాజకీయ పార్టీ నాయకులు స్పందించకపోవడం దురదృష్టకరమని ఆవేదనను వ్యక్తపరిచారు. హిందూ వాహిని రాష్ట్ర కన్వీనర్ బండారు గురువయ్య మాట్లాడుతూ మైనార్టీ హిందువులపై దాడికి పాల్పడి వారి ఆస్తులను ధ్వంసం చేసిన దుండగులపై వెంటనే బంగ్లాదేశ్ ప్రధాని తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శాంతిని నెలకొల్పడంలో విశేష కృషి చేసిన వారికి అందించే నోబుల్ బహుమతి బాంగ్లాదేశ్ ప్రధానికి అందజేసారని, కానీ తన సొంత దేశంలోనే శాంతిభద్రతలను కాపాడడంలో పూర్తిగా విఫలం చెందినందున ఆయన నుండి నోబుల్ బహుమతిని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బిజెపి లీగల్ సెల్ రంగారెడ్డి జిల్లా కన్వీనర్ పీఠం ప్రదీప్ మాట్లాడుతూ బాంగ్లాదేశ్ లోని మైనార్టీ హిందువుల పై జరుగుతున్న దమనకాండకు ఐక్యరాజ్యసమితి తక్షణమే జోక్యం చేసుకొని బాంగ్లాదేశ్ పై ఆంక్షలు విధించి మైనారిటీ హిందువులకు న్యాయం చేయాలని అన్నారు. ధర్నా కార్యక్రమంలో న్యాయవాదులు, విహెచ్‌పి నాయకులు వి.అంజయ్య, నరేష్ నర్సింగ్గోజి, కొండూరు వినోద్ కుమార్, చుంచు భాయ్ తదితరులు పాల్గొన్నారు.

## శివకుమార్‌రెడ్డిని తక్షణమే అరెస్టు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డప్పు సునీత

**సైఫాబాద్, డిసెంబరు 5 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీకి చెందిన బిసి మహిళపై లైంగికంగా వేధించి, దాడి చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకుడిని తక్షణమే అరెస్టు చేసి, పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని మహిళా రక్షణ పోరాట సమితి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గత రెండు సంవత్సరాలుగా ప్రభుత్వానికి, కాంగ్రెస్ పార్టీకి విజ్ఞప్తి చేసిన పట్టించుకోవడం లేదని, తక్షణమే సిఎం జోక్యం చేసుకుని తగు చర్యలు తీసుకోవాలని, లేని పక్షంల పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని సమితి ప్రతినిధులు హెచ్చరించారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమితి అధ్యక్షురాలు డప్పు సునీత, కార్యదర్శి అనసూయ, సుధారాణి, లావణ్య, రేణుక, అనిత, పద్మ, జ్యోతి తదితరులు మాట్లాడుతూ రేండుళ్ళ క్రితం పంజాగుట్టకు చెందిన ఒక బిసి మహిళను నారాయణపేటకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు కుంభం శివకుమార్‌రెడ్డి ఆమెను లైంగికంగా వేదించి దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. దీంతో మహిళలంతా అతన్ని అరెస్టు చేయాలని, పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేయడం జరిగిందన్నారు. అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులకు పలు మార్లు ఫిర్యాదు చేశామని, పోలీసులు అతన్ని అరెస్టు చేయలేదని, పార్టీ అతన్ని పదవుల నుంచి తొలగించిందని, కాని పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి సస్పెండ్ చేయలేదని ఆరోపించారు. ఇటీవల సిఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేద్దామని ఆయన కోసం ఇల్లు, గాంధీ భవన్ చుట్టు తిరిగినా కలువలేదన్నారు. తక్షణమే రెడ్డిని అరెస్టు చేసి, పార్టీ నుంచి సస్పెండ్ చేసి, ఆ మహిళకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



డబుల్ బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేస్తున్న మంత్రులు

**ముషీరాబాద్, డిసెంబర్ 5, ప్రభాతవార్త:**

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర గృహనిర్మాణ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడడ్డి, బీసీ శాఖామాత్యులు పొన్నం ప్రభాకర్‌లు స్పష్టం చేశారు. గురువారం వారు కలెక్టర్ కార్యాలయంలో మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఉప మేయర్ శ్రీలత, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌లతో కలసి డబుల్ బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 37 మంది లబ్ధి దారులు ఇళ్ల పత్రాలను అందుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ అన్ని విధాల పేదలకు అండగా ఉంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కవాడిగూడ కార్పోరేటర్ రచనశ్రీ, బీఆర్ఎస్ యువ నాయకులు ముఠా జైసింహ, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, స్థానిక బీఆర్ఎస్ నేతలు, బీజేపీ నేతలు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.


**BEFORE THE DEBTS RECOVERY TRIBUNAL-2**
**1st FLOOR, TRIVENI COMPLEX, ABIDS**
**AT::HYDERABAD**

**I.A. No.1713 of 2024**
**in**
**O.A.NO 918 OF 2018**

**Between:**
Union Bank of India, Hyderabad,
Lead Bank under Consortium and
4 Others ...Applicants
And
M/s. Vinayaka Paper and Boards Limited
and Others ...Defendants
To
Sri Deba Bratha Kantha,
S/o. Sri Purna Chandra Kantha,
Age: 53 years, Occ: Business,
Residing at B-2-293/B2/PH/97,
Jubileehills, Hyderabad,
Telangana-500 033. ...Defendant NO.2

**SUMMONS BY PAPER PUBLICATION FOR SHOWING CAUSE AS TO WHY THE RELIEF PRAYED SHOULD NOT BE GRANTED**

Take Notice that the above applicants have filed petition under Section 19(13) A&B of the Recovery of Debts due to Banks and Financial Institutions Act, 1993 vide I.A. No.1713 of 2024 in the above O.A and the matter stands posted on 20-01-2025 for your appearance.

You are hereby required to appear in this Tribunal in person or by a pleader on **20-01-2025 at 10.30.a.m.** failing which the matter would be decided in your absence in accordance with law.

**(BY ORDER OF THE HON'BLE TRIBUNAL)**
**M/s. M.V.S. PRASAD,**
**K.SUBBA RAO**
Advocates for Petitioner/Applicant
Plot No.135/5, Street No.5, M.J.Colony,
Gayatri Nagar, Moula Ali,
Hyderabad-500 040
Email: mvsprasad.advocate@gmail.com


## మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు

**-ఎమ్మెల్యే శ్రీగణేష్**

**కంటోన్మెంట్,డిసెంబరు 5 ప్రభాతవార్త:**

కంటోన్మెంట్‌లో మంచినీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. గురువారం 7వ వార్డు తిరుమలగిరి లాలమియా బస్తీలో రూ.6 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన పవర్‌బోర్‌వెల్ పనులను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు నాగినేని సరిత తదితరులు పాల్గొన్నారు.

### మద్యంమత్తులో కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

**నార్సింగి, డిసెంబర్ 5 ప్రభాతవార్త :**

మద్యం మత్తులో కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... గండిపేట మండలం కోకాపేట్ లోని ఆర్ఆర్ఆర్ వైన్‌షాపు ముందు ఓ గుర్తు తెలియన వ్యక్తి మద్యం మత్తులో రాయిపై పడ్డాడు. దీంతో తల భాగంలో తీవ్ర రక్తస్రావమైంది. ముక్కు ,నోట్లో నుంచి అన్నం కక్కుకున్నాడు. అటుగా వెళ్తున్న దస్తగిరి అనే వ్యక్తి ఎంత పిలిచినా స్పందన లేకపోవడంతో 100.కు ఫోన్‌చేసి సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న నార్సింగి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహంను పరిశీలించారు. అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మృతుడు 30-35.సంవత్సరాల వయసు ఉంటాడని, నల్లని షాట్, తెల్లని టీషర్ట్ ధరించి ఉన్నాడని, సంబంధీకులు ఎవరైనా ఉంటే నేరుగా నార్సింగి పోలీసు స్టేషన్‌లో కలువాలని సూచించారు. మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
సూపరింటెండింగ్ ఇంజనీర్ (ప్రాజెక్టులు) కార్యాలయం, సౌత్ జోన్,
గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్
6వ అంతస్తు, సిసి కాంప్లెక్స్, ట్యాంక్ బండ్ రోడ్, హైదరాబాద్.

**'ఇ'-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన**

టెండర్ ప్రకటన నం.08/SE(P)SZ/GHMC/2024-25, 3వ పిలుపు, తేదీ: 05.12.2024
**ఐటమ్ నం.1. పని పేరు:** యాకుత్‌పురా మరియు హుప్పుగూడ రైల్వే స్టేషన్ మధ్యన రైల్వే కి.మీ. 11/900-12/0 వద్ద దాని డ్రైనేజీలు మరియు ప్రతిపాదిత RUBకు అప్రోచ్‌లు వేయుట. (SC కొరకు రిజర్వ్‌డు) అంచనా వ్యయం (రూ.లక్షలలో): 99.95, మొత్తం: **99.95.** వివరములు, తేదీ మరియు సమయం: **1)** డౌన్‌లోడ్ (ప్రారంభ తేదీ, సమయం: 09.12.2024 మ.12.00 గం. నుండి **2)** బిడ్స్ దాఖలుకు చివరి తేదీ, సమయం: 16.12.2024 మ.2.30 గం. వరకు **3)** టెక్నికల్ బిడ్ తెరుచు తేదీ, సమయం: 16.12.2024 మ.3.00 గం. వద్ద **4)** ప్రైస్ బిడ్ తెరుచు తేదీ, సమయం: 17.12.2024 సా.4.00 గం. వద్ద. సంబంధిత అధికారి చిరునామా: సూపరింటెండింగ్ ఇంజనీర్ (ప్రాజెక్టులు), సౌత్ జోన్, GHMC, 6వ అంతస్తు, సిసి కాంప్లెక్స్, ట్యాంక్ బండ్ రోడ్, హైదరాబాద్. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @http://tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (ప్రాజెక్టులు), సౌత్ జోన్, GHMC
DIPR.No.7524-PP/CL/Advt/1/2024-25, తేదీ: 05.12.2024



**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR NEAR NEILOFER HOSPITAL, RED HILLS, HYDERABAD. DISPUTE NO.222 OF 2024.**

**Between:-**
M/s. Saptavandana Chits & Finances Pvt. Ltd.,
**...Disputant.**
**And**
Sri.R.Madhusudhana Chary & Others
**...Opponents**

1. Sri.R.Madhusudhana Chary, S/o. R.Venunadam, Aged about 42 Yrs., Occ: Govt. Employee as SGT, O/o. Mandal Primary School, ZPHS Compound, Nadergul, Balapur, Hyderabad. R/o. H.No.9-10-3/55, P.No.55, Opp: YBR Function Hall, inside to Kanaan-RCI Road, Vijayadurga Colony, Balapur, Hyderabad.
2. Smt.G.Swetha, W/o. R.Madhusudhana Chary, Aged about 42 Yrs., Occ: Govt. Employee as School Asst., O/o. ZPHS (Girls), Amangal, Srisailam Road, Hyderabad. R/o. H.No.9-10-3/55, P.No.55, Opp: YBR Function Hall, inside to Kanaan-RCI Road, Vijayadurga Colony, Balapur, Hyderabad.
3. Smt.R.Saroja, W/o. Bakya Naik, Aged about 42 Yrs., Occ: Govt. Employee as SGT, O/o. MPPS, Tallakondapally, Inside to Amangal, ZPHS Compound, Amangal, Shadnagar Route, Hyderabad. R/o. H.No.1-57/4, Viveknagar Colony, Jillellaguda, Balapur Mandal, Hyderabad.
4. Sri.M.Chandrasekhar, S/o. M.Rama Krishnaiah, Aged about 49 Yrs., Occ: SGT, O/o. UPS, Jakinallapally, Near to Tallakondapally, R.R.District. Presently on Deputation to SGT, O/o. UPS, Rachapally, Nagar Kanool District.R/o. H.No.8-6-183/5, Padmavathi Colony, Road.No.2, Venkata Raman Colony, Vanastalipuram, Hyderabad.

**...OPPONENTS**

Whereas the above named Disputant the above claim petition filed against you, for recovery of Rs.7,41,500/-. The above claim petition is posted to dated 24-12-2024 for your appearance. You are hereby Notice to appear either in person or through pleader with your defence if any at 12.00A.M. On the above said date before the Hon'ble Deputy Registrar of Chits, failing which the above said claim petition will be heard and determined exparte.

**"BY ORDER" (ARBITRATOR AND DISTRICT/ DEPUTY REGISTRAR OF CHITS)**
**A.Lavan Kumar**
Advocate
#408, Swapnalok Complex,
S.D.Road, Secunderabad.



**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR NEAR NEILOFER HOSPITAL, RED HILLS, HYDERABAD. DISPUTE NO.484 OF 2024.**

**Between:-**
M/s. Saptavandana Chits & Finances Pvt. Ltd.,
**...Disputant.**
**And**
Sri.M.Srinivas & Others
**...Opponents**

1. Sri.M.Srinivas, S/o. Late M.Gopala Krishna Murthy, Aged about 48 Yrs., Occ: Sr. Research Scientist-2, R/D, Laurus Labs Ltd., DS-I, 1KP Knowledge Park, Gerome Vally, Thurkapally, Shamirpet, Hyderabad. R/o. H.No.10-72/2, 2nd Floor, Sowbhagyanagar, Opp:IDPL Colony, Balanagar, Hyderabad.
2. Sri.M.Ravinder, S/o. Late M.Yadagiri, Aged about 57 Yrs., Occ: Govt. Employee as Record Asst., O/o. Member legislature Secretariat(Counsel), Public Garden, Nampally, Hyderabad. R/o.18-5-827, Aliayabad Out Side, Laldarwaza, Charminar, Hyderabad.
3. Sri.B.Laxman, S/o. Somlal, Aged about 57 Yrs., Occ: Govt. Employee as Farrash, Department of Protocal, Govt. of TS, Nampally, Hyderabad. R/o. H.No.7-1-632/87, Bapujinagar, SR Nagar, Hyderabad.
4. Sri.G.Ushaiah, S/o. Late Pentaiah, Aged about 57 Yrs., Occ: Govt. Employee as Cleaner, Govt. Guest House, Govt. of TS, Protoval Department, Beside SBI, Green Land, Hyderabad. R/o. H.No.4-5-150, Rambagh, Attapur Colony, Opp: Pedda MAsjid, Attapur, Rajendranagar, Hyderabad.
5. Sri.S.Venkatesh, S/o. Sailu, Aged about 37 Yrs., Occ: Govt. Employee as Messenger, O/o. MCE-ME Faculty of Electronics, Defence Office, Lalbazar, Lothukunta, Secunderabad.

**...OPPONENTS**

Whereas the above named Disputant the above claim petition filed against you, for recovery of Rs.85,732/-. The above claim petition is posted to dated 24-12-2024 for your appearance. You are hereby Notice to appear either in person or through pleader with your defence if any at 12.00A.M. On the above said date before the Hon'ble Deputy Registrar of Chits, failing which the above said claim petition will be heard and determined exparte.

**"BY ORDER" (ARBITRATOR AND DISTRICT/ DEPUTY REGISTRAR OF CHITS)**
**A.Lavan Kumar**
Advocate
#408, Swapnalok Complex,
S.D.Road, Secunderabad.

# సిసి రోడ్డు పనులు ప్రారంభం



మల్కాజిగిరి డిసెంబరు5,ప్రభాతవార్త : ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలో సిఫిల్ కాలనీ లో 15 లక్షల తో సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ ప్రారంభించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఏ ఈ శ్రీకాంత్,వర్క్ ఇన్స్పెక్టర్ రజినీకాంత్, సత్యనారాయణ, కిషోర్,సిఫీల్ కాలనీ అసోసియేషన్ సభ్యులు కృష్ణ,ఓం రాజ్,సోమయ్య,శేషగిరి రావు, చంద్రకళ,చంద్రకాంత్,రాజు,సుష్మిత,కిరణ్ కుమార్, సంధ్యా, వనమాల,వీణ,వెంకటేశ్వర్లు,మాధవి,నాగేశ్వర్ రావు పాల్గొన్నారు.

## ఘనంగా స్వచ్ఛంద సేవకుల దినోత్సవం



అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న దృశ్యం

మలక్ పేట,డిసెంబరు 5, ప్రభాతవార్త: ప్రజలు, ప్రభుత్వాలు స్వచ్ఛంద సేవకుల, సంస్థల కృషిని అభినందించి ప్రోత్సహించాలని మాజీ సెంట్రల్ మినిస్టర్, తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ సముద్రాల వేణుగోపాలచారి పేర్కొన్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ చిక్కడపల్లి లోని శ్రీత్యాగరాయ గానసభ లో "అంతర్జాతీయ స్వచ్ఛంద సేవకుల దినోత్సవం" ఘనంగా జరిగింది. అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీమోహన్ రాజు మాట్లాడుతూ ఎటువంటి లాభాపేక్షలేని స్వచ్ఛంద సంస్థలు గ్రామ స్థాయి నుండి పట్టణ స్థాయి వరకు ఎన్నో రకాల సేవలు అందిస్తున్నాయని వివరించారు. అనంతరం ఉత్తమ సేవా అవార్డు గ్రహీతలు నర్ల సురేష్, అలియా భాను, మిరియాల లక్ష్మి, నరసింహులు గౌడ్, ఎస్.రేష్మ కౌర్, కె.విజయకుమార్, జె.నాగలక్ష్మి, ఉన్నన్న వెంకటేశ్వర్లు లను ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో రిటైర్డ్ జడ్జి డాక్టర్ బూర్గుల మధుసూధన్ రావు, ఆయుర్వేద వైద్యులు డాక్టర్ కూరపాటి శ్యాందన్, రచయిత్రి డాక్టర్ రాధ కుసుమ, వై. చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే సహకార సంఘాల లక్ష్యం : సత్తయ్య



తుర్కయంజాల్ డిసెంబరు5,ప్రభాతవార్త : రైతుల సంక్షేమమే సహకార సంఘాల లక్ష్యమని తుర్కయాంజల్ రైతు సేవా సహకార సంఘం అధ్యక్షుడు కొత్త కుర్మా సత్తయ్య పేర్కొన్నారు. గురువారం తుర్కయాంజల్ రైతు సేవా సహకార సంఘం పాలకవర్గ సమావేశం అధ్యక్షుడు కొత్త కుర్మ సత్తయ్య,వైస్ చైర్మన్ అధ్యక్షుతన జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. .నూతన సభ్యులుగా 19 మందిని చేర్చుకున్నామని 22 మంది రైతులకు 2కోట్ల 9 లక్షల రూపాయలు అప్పులు మంజూరు చేయడం జరిగిందని వ్యవసాయ అప్పులు ఒక సభ్యునికి గరిష్టంగా రూ 20లక్షల నుండి రూ 25 లక్షలకు, మరియు ఒక ఎకరాకు 5 లక్షల నుండి రూ 6 లక్షలకు పెంచడం జరిగిందని సంఘం సభ్యుల సంక్షేమం కొరకు ఇతర అభివృద్ధి కార్యక్రమాలను అమోదించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, సంఘ డైరెక్టర్లు , చెక్క లక్షీమ్మ, సామ సంజీవరెడ్డి, కుతడి నర్సింగరావు, వంగేటి లక్ష్మ రెడ్డి, కొండ్రు స్వప్న,చాపల యాదగిరి, శీలం లక్ష్మమ్మ, జక్క కృష్ణ రెడ్డి, సామ సత్య నారాయణ రెడ్డి, మరియు సంఘ సెక్రెటరీ వై. రాందాస్ పాల్గొన్నారు .

## రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కమిషనర్‌కి వినతి



తుర్కయంజాల్ డిసెంబరు 5, ప్రభాతవార్త: తుర్కయంజాల్ ఎస్సి బస్తిలో రోడ్డును మరమత్తులు చెయ్యాలని కోరతూ గురువారం తుర్కయంజాల్ మున్సిపల్ కమీషనర్ అమరేందర్ రెడ్డికి బిజెపి రాష్ట్ర ఎస్సి మోర్చా కోశాధికారి బచ్చిగళ్ళ రమేష్ వినతిపత్రం అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ తుర్కయంజాల్ మున్సిపల్ కార్యాలయం నుండి శ్రీ పాల్ కళాశాల వరకు వాటర్ లైన్ గురించి రోడ్డును తవ్వి దాదాపు 45 రోజులు కావాస్తున్న రోడ్డుకు ఎలాంటి మరమత్తులు చెయ్యకుండా వదలడం వలన నిత్యం రద్దిగా ఉండే రోడ్డు అద్వాన స్థితికి చేరుకొని వాహనదారులు మరియు బస్తివాసులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కాబట్టి కొత్తగా సీసీ రోడ్డు వేయగలరని మున్సిపల్ కమీషనర్ కోరినట్లు తెలిపారు. కమిషనర్ అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే మరమ్మతులు రోడ్ల అక్కడక్కడ గుంతలు ఉన్న గుంతలు పూడ్చడం చేయిస్తానని హామీ ఇచ్చారు.

## స్మశానవాటికలో స్నానాలగదులు, బోర్లు, లైట్ల కోసం వినతి



మీర్‌పేట్ కమీషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న సోమేశ్వర్ తదితరులు

సరూర్‌నగర్, డిసెంబరు 5 ప్రభాతవార్త: మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ ప్రగతినగర్, సాయినగర్ కాలనీల సమీపంలోనున్న స్మశానవాటికలో కార్పొరేషన్ తరపున కనీస సౌకర్యాలు కల్పించాలని కార్పొరేషన్ బిజెపి ప్రధాన కార్యదర్శి కోడూరు సోమేశ్వర్, నాయకులు బచ్చనమోని నర్సింహయాదవ్, కాశీరాం యాదవ్, వలభోజు గోపినాథ్‌లు కమీషనర్‌ను కోరారు. ఈ మేరకు గురువారం కమీషనర్ జ్ఞానేశ్వర్‌ను కలిసి ఒక వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు స్మశానవాటికలో సౌకర్యాలు లేకపోవడం వల్ల ఇక్కడికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని కమీషనర్ దృష్టికి తెచ్చారు. స్నానాల గదులు లేకపోవడం వల్ల బహిరంగ ప్రదేశంలో సైడ్ వాల్స్ తాత్కాలికంగా ఏర్పాటు చేసుకొని స్నానాలు చేస్తున్నారనీ అదే విధంగా డబ్బులు వెచ్చించి ట్యాంకర్లు తెప్పించుకోవాల్సిన దుస్థితి కలుగుతోందని వారు వివరించారు. స్మశానవాటిక ప్రాంతంలో కనీసం విద్యుత్ లైట్లు కూడా లేవని వారు విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు కార్పొరేషన్ స్పందించి స్నానాల గదులు, బోరు, లైట్లు ఏర్పాటు చేయాలని వారు కమీషనర్‌ను కోరారు.

# క్రీడలను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తాం : ఎమ్మెల్యే బలాల

మలక్ పేట ,డిసెంబరు 5, ప్రభాతవార్త: క్రీడలను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామని మలక్ పేట నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. ఎస్ కె ఎం హైదరాబాద్ గ్లోబల్ మర్చంట్స్ స్పోర్ట్స్ లీగ్ సీజన్ 4 పోటీలను ఎమ్మెల్యే బలాల ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలతో చక్కటి ఆరోగ్యం చేకూరుతుందని తెలిపారు. క్రీడాకారులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారికి తమ వంతు సహాయ, సహకారాలు అందించడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. శ్రీ కృప మార్కెట్ హోల్ సేల్ అండ్ రిటైల్ మర్చంట్ అసోసియేషన్ మలక్ పేట్ మార్కెట్ అధ్యక్షుడు చిక్కా చంద్రమోహన్ మాట్లాడుతూ శ్రీ కృప మార్కెట్ హోల్ సేల్ అండ్ రిటైల్ మర్చంట్ అసోసియేషన్, హైదరాబాద్ దాల్ మిల్స్ అండ్ మర్చంట్ అసోసియేషన్ మహారాజ్ గంజ్, హైదరాబాద్ కిరాణా మర్చంట్ అసోసియేషన్ బేగంబజార్, ది సికింద్రాబాద్ హోల్ సేల్ గ్రెయిన్ మర్చంట్స్ అసోసియేషన్ సికింద్రాబాద్‌ల సంయుక్త ఆధ్వర్యంలో క్రికెట్, క్యారం, చెస్ తదితర ఆటల పోటీలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. డిసెంబర్ 8వ తేదీ 15వ తేదీ 22వ తేదీలలో పోటీలు జరుగుతాయని తెలిపారు .నాగోల్ లోని సిఎన్ఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో పోటీలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.కార్యక్రమంలో నిర్వాహకులు దీపక్ మోడీ, అనిల్ కుమార్ కాబ్రా, పవన్ మార్ధ, మనీష్ బాటి , వినయ్ జెయిన్ పాల్గొన్నారు.



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలాల చిత్రంలో అధ్యక్షుడు చిక్క చంద్రమోహన్ తదితరులు

# ఫిర్యాదులపై చర్యలు తీసుకోకుంటే హైడ్రాకు వెళ్తాం: బడంగ్‌పేట్ బిజెవైఎం

సరూర్‌నగర్, డిసెంబరు 5 ప్రభాతవార్త: బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ఖాళీ స్థలాల కబ్జాలపై తాము ఇచ్చిన ఫిర్యాదుల పట్ల కార్పొరేషన్ స్పందించి చర్యలు తీసుకొని వాటిని కాపాడకపోతే హైడ్రాకు ఫిర్యాదు చేస్తామని కార్పొరేషన్ బిజెవైఎం అధ్యక్షుడు రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. కార్పొరేషన్‌లోని 19వ డివిజన్ గాయత్రీహిల్స్ కాలనీకి సంబంధించిన సర్వే నెంబర్లు 776, 756లలో ప్రజోపయోగార్థం లేఔట్‌లో వదిలిన ఖాళీ స్థలాలను కొంత మంది రాజకీయ నేతలు దౌర్జన్యంగా కబ్జాలు చేసి భవన నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపిస్తూ ఆయన కమీషనర్ దృష్టికి తెచ్చారు. ఈ మేరకు గురువారం రామకృష్ణారెడ్డి పలువురితో కలిసి కమీషనర్ సరస్వతికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నగర పంచాయతీ బడంగ్‌పేట్ ఉన్నప్పుడు కొందరు సదరు ఖాళీ స్థలాలను కబ్జా చేయడానికి ప్రయత్నిస్తూ అప్పట్లో ఉన్న టిపిఓ స్పందించి అక్రమ నిర్మాణాలను కూల్చివేసి ఎవరైనా తిరిగి కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారని గుర్తు చేశారు. అయితే కార్పొరేషన్‌గా బడంగ్‌పేట్ మారిన తర్వాత టౌన్ ప్లానింగ్ విభాగం వారు ఖాళీ స్థలాల కబ్జాలను పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. ఈ నేపథ్యంలో కమీషనర్ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఇప్పటికైనా కబ్జాలను అడ్డుకొని ఖాళీ స్థలాలను కాపాడకపోతే తాము హైడ్రా కమీషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేస్తామని రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గాయత్రీనగర్ కాలనీవాసులు పవన్, మల్లెల మహేందర్, బిజెవైఎం నాయకులు సతీష్‌నంద, ప్రవీణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బడంగ్‌పేట్ కమీషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న బిజెవైఎం అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి

# ప్రజా సమస్యల పరిష్కారమే ద్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోంది : మల్‌రెడ్డి రంగారెడ్డి

హయత్‌నగర్, డిసెంబరు 5 ప్రభాతవార్త: ప్రజా సమస్యల పరిష్కారమే ద్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ పరిధి కుంట్లూర్, పసుమాముల, పెద్దఅంబర్‌పేట గ్రామాల్లోని ఆయా వార్డులలో 15 కోట్ల రూపాయల నిధులతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన గురువారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ పండుగుల జయశ్రీరాజు, వైస్‌ఛైర్‌పర్సన్ చామ సంపూర్ణావిజయశేఖ ర్‌రెడ్డి, కమిషనర్ రవీందర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏడాది కాలంలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ముఖ్యమంత్రి సఫలీకృతుడయ్యాడని తెలిపారు. మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, సబ్సిడీ గ్యాస్ సరఫరా, డబల్‌బెడ్‌రూం ఇళ్ల పంపిణీ, రైతులకు రుణమాఫీ వంటి వాటితో పాటు ఏడాదిలో నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి కల్పనలో ప్రభుత్వం విజయం సాధించినట్లు వివరించారు. వచ్చే సంక్రాంతి నాటికి రైతుభరోసా పథకాన్ని సైతం అమలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి సంబంధించి మున్సిపాలిటీ లు, మండలాలలో సమస్యల పరిష్కారానికి అవసరమైన నిధులను కేటాయిస్తూ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడానికి కృషిచేస్తున్నామన్నారు. ఈక్రమంలో పెద్దఅం బర్‌పేట మున్సిపాలిటీ పరిధిలో డ్రైనేజీ సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సమస్య పరిష్కారానికి అవసరమైన నిధులను సమకూర్చినట్లు వివరించారు. పనులు కూడా దాదాపుగా పూర్తయ్యాయని త్వరలోనే సమస్య శాశ్వతంగా పరిష్కరించబడుతుందన్నారు. తాగునీరు, రోడ్లు వంటి మౌళిక సదుపాయాలను కల్పించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. కోహెడలో 250 ఎకరాల్లో 2000 కోట్ల రూపాయలతో సమీకృత వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారని దాని ద్వారా స్థానికులకు ఉపాధి దొరుకుతుందన్నారు. అనంతరం పెద్దఅంబర్‌పేటలోని ఇందిరాగార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఛైర్‌పర్సన్ లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందించారు. కార్యక్రమంలో కమిషనర్ రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ కమిటీ అధ్యక్షులు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.



అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే రంగారెడ్డి

# ఇచ్చిన హామిలు అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే

-ఆదం సంతోష్ కుమార్

తార్నాక, డిసెంబర్ 5 ప్రభాతవార్త: సంవత్సర కాలంలోనే ఇచ్చిన హామిలు అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని సికింద్రాబాద్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్ కుమార్ పేర్కొన్నారు. ఏడాది కాలంగా ప్రభుత్వం చేసిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకే ప్రజా విజయోత్సవాలను ప్రభుత్వం నిర్వహిస్తుందని ఆదం సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. ప్రజాపాలన విజయోత్సవ వేడుకలను గురువారం లాలాపేట్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఆదం సంతోష్ కుమార్ పాల్గొని వందలాది మంది మహిళలకు చీరెలను పంపిణీ చేశారు. సంవత్సర కాలంలోనే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హాయాంలో ప్రజలు సంతోషంగా ఉన్నారని కొనియాడారు. ఈ సందర్భంగా వివిద సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు టీపీసీసీ కార్యదర్శి జీడీ అమర్‌నాథ్ గౌడ్, తార్నాక డివిజన్ అధ్యక్షులు ప్రహ్మాజీ, సికింద్రాబాద్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కిషోర్ యాదవ్, పార్టీ నగర ఆర్గనైజింగ్ సెక్రెటరీ చింతల్ కిట్లు, చింతల్ నరేష్, జెలెందర్, వాజీద్, రవి, బబ్బులు, చక్రం, సందీప్, శేఖర్, విశాల్, సునిత, లక్ష్మి, అనిల్, షకిల్, పద్మావతి, శశాంక్, హనుమంతు, ప్రసాద్, బాబా, అశోక్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు ఆదం సంతోష్ కుమార్, చిత్రంలో జీడి అమర్‌నాథ్ గౌడ్ తధితరులు

# ఉప్పల్‌లో సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటం ఫ్లెక్సీ వివాదం..!

-తొలగించిన అధికారులు..కొత్త ఫ్లెక్సీల ఏర్పాటు

ఉప్పల్, డిసెంబరు 5 ప్రభాతవార్త : ఉప్పల్‌లో సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటంతో ఉన్న ఫ్లెక్సీ వివాదం తీవ్ర దుమారం రేపింది. దీంతో అధికారులు వెంటనే స్పందించి అధికారులు తొలగించారు.వివరాలు ఇలా ఉన్నాయి. ప్రజాపాలన వారోత్సవాల సందర్భంగా గురువారం ఉప్పల్ సర్కిల్‌లోని గురువారం 2కె రన్ నిర్వహించారు. ఎల్‌బినగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్ తోపాటు, డిసి అంజనేయులు, జిహెచ్‌ఎంసి స్పోర్ట్స్ అడిషనల్ కమిషనర్ యాదగిరావు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొని కార్యక్రమం నిర్వహించారు. అయితే సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటంతో ఉన్న ఫ్లెక్సీలో చేతిని మార్పింగ్ చేసి వివాదాస్పదంగా తయారు చేశారు. దీనిని గమనించకుండా అధికారులు అదే ఫ్లెక్సీలు పలు చోట్ల ఏర్పాటు చేశారు. అయితే దీనిని గమనించిన కొందరు స్థానికులు విషయాన్ని మీడియా దృష్టికి తీసుకుని రావడంతో అధికారులకు సమాచారం అందించారు. దీంతో అధికారులు పాత ఫ్లెక్సీలు తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేశారు. తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటంతో ఉన్న ఫ్లెక్సీతో కార్యక్రమాలు చేసిన అధికారులు దీనిని గమనించకుండానే కార్యక్రమం ముగించడం గమన్హారం. ఏది ఏమైనా కిందిస్థాయి అధికారులు చేసిన పనికి ఉప్పల్‌లో పెద్ద వివాదంగా మారింది. అధికారులు దీనిపై విచారణకు ఆదేశించారు.




ఉప్పల్‌లో సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటం ఫ్లెక్సీ వివాదంతో తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది దృశ్యం.

## బడంగ్‌పేట్‌లో ఘనంగా అయ్యప్ప పడి పూజోత్సవం



పడి పూజకు హాజరైన బడంగ్‌పేట్ మేయర్ పారిజాత

సరూర్‌నగర్, డిసెంబరు 5 ప్రభాతవార్త: బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 29వ డివిజన్‌లో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పెద్దబావి సుదర్శన్‌రెడ్డి (బాబు) ఆధ్వర్యంలో గురువారం అయ్యప్ప స్వామి పడి పూజోత్సవం ఘనంగా జరిగింది. బాబు మాలధారణ చేసిన సందర్భంగా మహా గురుస్వామి భీమిడి జంగారెడ్డి చేతుల మీదుగా పడి పూజను నిర్వహించారు. ఈ పడి పూజోత్సవానికి మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, మాజీ ఎంపిటిసి పెద్దబావి ఆనంద్‌రెడ్డి, కార్పొరేటర్లు పెద్దబావి శోభా ఆనంద్‌రెడ్డి, పెద్దబావి శ్రీనివాస్ రెడ్డి, పెద్దబావి సుదర్శన్‌రెడ్డిలతో పాటు యాదగిరిరెడ్డి, అంజిరెడ్డి, మహేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, మౌనిక సుదర్శన్‌రెడ్డి, గురుస్వామి కర్రె కృష్ణ, పలువురు అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

## సిపిఐ సభ్యత్వాలను పెంచాలి : కామ్రేడ్ రవీంద్రచారి



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రచారి

సరూర్‌నగర్, డిసెంబరు 5 ప్రభాతవార్త: మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో సిపిఐకి పూర్వ వైభవం వచ్చే విధంగా పార్టీ సభ్యత్వాలను పెంచాలని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బాలాపూర్ మండల సిపిఐ సమితి ఆధ్వర్యంలో గురువారం మీర్‌పేట్ నందిహిల్స్‌లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఆయన సభ్యత్వ నమోదును ప్రారంభించి మాట్లాడుతూ పేదలు, మధ్య తరగతి ప్రజలు, కార్మికులు, కర్షకుల వైపు నిలబడి పోరాడే ఏకైక పార్టీ సిపిఐ యేనని స్పష్టం చేశారు. పార్టీ సేవలను గుర్తించి ప్రజలు ఆదరించాలని ఆయన కోరారు. పార్టీ సభ్యత్వ నమోదు సందర్భంగా నాయకులు, కార్యకర్తలు సభ్యత్వాలను ముమ్మరంగా చేయాలని ఆయన సూచించారు. పార్టీకి పట్టుగొమ్మలైన పని చేసే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ముకుందం చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు జర్పుల శివనాయక్, జాజాల అంజయ్య, బండ యాదమ్మ యాదవ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఐఎస్ సదన్ డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషి : జంగం శ్వేత మధుకర్‌రెడ్డి



వాటర్ పైపులైన్ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి

సైదాబాద్, డిసెంబరు 5 ప్రభాతవార్త: ఐఎస్ సదన్ డివిజన్ సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి అన్నారు. సింగరేణి ఆఫీసర్స్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న 100 ఎంఎం డయా వాటర్ పైపులైన్ పనులను ప్రారంభించిన అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిజిఎం సన్యాసిరావు, మేనేజర్ రమ్య పాల్గొన్నారు.

## విద్యుత్ తయారీపై విద్యార్థులకు అవగాహన



విధ్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

సైదాబాద్, డిసెంబరు 5 ప్రభాతవార్త: ప్రజాపాలన విజయోత్సవాలలో స్కిల్ డెవలప్‌మెంట్ లో భాగంగా లింగోజిగూడ జడ్పిహెచ్‌ఎస్‌లో 8,9వ తరగతి విద్యార్థులను జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌కు తీసుకువెళ్లి చెత్త ద్వారా విద్యుత్‌ను ఎలా తయారు చేస్తారు అనే అంశంపై అవగాహన కల్పించినట్లు కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఒక్క చదువుపైనే కాకుండా సమాజంలో మన చుట్టూ జరుగుతున్న విషయాలపై కూడా అవగాహన ఉండాలన్నారు. చిన్ననాటి నుంచే ప్రతి విషయాన్ని తెలుసుకుంటూ విద్యార్థులు ముందుకు వెళ్లాలన్నారు.కార్యక్రమంలో రాంకి ఇంఛార్జి వేణు, కృష్ణ, ఉపేందర్, శ్రీధర్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హరీష్‌రావు అరెస్ట్ సబబు కాదు : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



మాజీ మంత్రి హరీష్‌రావును పరామర్శిస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

ఉప్పల్, డిసెంబరు 5 ప్రభాతవార్త : మాజీ మంత్రి హరీష్‌రావును అరెస్ట్ చేయడం సబబు కాదని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం మాజీ మంత్రి హరీష్‌రావును గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఆయన పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహించడం సబబు కాదన్నారు. అక్రమ అరెస్ట్ చేసిన హరీష్‌రావును వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్న బిఆర్ఎస్ నేతలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. అరెస్ట్‌లకు భయపడేది లేదని హరీష్‌రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## పార్కును శుభ్రపరిచి, ప్రహరీకి మరమ్మతులు చేయాలి

: కళ్లెం కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి



కాలనీలో పిచ్చిమొక్కలను పరిశీలిస్తున్న కార్పొరేటర్

హయత్‌నగర్, డిసెంబరు 5 ప్రభాతవార్త: పార్కుల ఆవరణలో పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రపరచాలని, ప్రహరీకి మరమ్మతులు చేయించాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన అధికారులతో కలిసి డివిజన్ పరిధిలోని బీడీఎల్ కాలనీలో పర్యటించి పార్కును పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడంపై సంతోషంగా ఉన్నామని అయితే పార్కులో పిచ్చిమొక్కలు పెరిగి అపరిశుభ్రంగా తయారయిందని, పార్కులోకి రావడానికి ఇబ్బందిగా మారిందని తెలిపారు. పార్కు ప్రహరీ అక్కడక్కడ ధ్వంసమయిందని దానికి మరమ్మతులు చేయించాలని కోరారు. దీనిపై కార్పొరేటర్ స్పందిస్తూ సంబంధిత సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు.కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు మాధవరెడ్డి, సభ్యులు శంకర్‌రెడ్డి,బాబు,నాయకులు ఎల్లప్ప,గోవిందాచారి,శ్రీను పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో ఘనంగా ప్రజాపాలన విజయోత్సవ ర్యాలీ



ప్రజాపాలన విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ ఎం.రజితరెడ్డి, జోనల్ కమిషనర్ హేమంత్ పాటిల్ తదితరులు

ఉప్పల్, డిసెంబరు 5 ప్రభాతవార్త : తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ఉత్సవాలు విజయవంతం చేయాలని ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఉప్పల్ సర్కిల్ కార్యాలయం నుంచి క్రికెట్ స్టేడియం వరకు జిహెచ్‌ఎంసి ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాపాలన విజయోత్సవ ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ ఎం.రజితరెడ్డితోపాటు, జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, అడిషనల్ కమిషనర్ యాదగిరిరావు, డిసి అంజనేయులు, మున్సిపల్ ఇంజనీర్ హరిలాల్, మైత్రేయి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందని, ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికి అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 2 కె రన్ నిర్వహించారు. అనంతరం క్రీడలలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు అకారపు అరుణ్ పటేల్, లింగంపల్లి రామకృష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి, జీతు, నరేష్ పలువురు అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఎబివిపి నగర మహాసభల పోస్టర్ అవిష్కరణ

ఉప్పల్, డిసెంబరు 5 ప్రభాతవార్త : నగరంలో ఈనెల 10వ తేదిన జరుపతలపెట్టిన అఖిల భారత విద్యార్థి పరిషత్ మహాసభ పోస్టర్‌ను గురువారం ఉప్పల్‌లో అవిష్కరించారు. ఎబివిపి రాష్ట్ర కార్యావర్గ సభ్యులు కార్తిక్, టౌన్ కార్యదర్శి సంతోష్ తదితరుల ఆధ్వర్యంలో పోస్టర్‌ను అవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఎబివిపి మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సభలకు వివిధ ప్రాంతాల నుంచి పలువురు విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.

## ఉప్పల్‌లో అక్రమ నిర్మాణాలు అరికట్టాలని కాలనీవాసుల ధర్నా



ఉప్పల్ సర్కిల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న గణేష్‌నగర్ కాలనీవాసులు

ఉప్పల్, డిసెంబరు 5 ప్రభాతవార్త : ఉప్పల్ సర్కిల్ పరిధిలోని గణేష్‌నగర్ కాలనీలో అక్రమ నిర్మాణాలు అరికట్టాలని పలువురు స్థానికులు గురువారం సర్కిల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కాలనీ నేతలు శ్రీధర్‌గుప్త, బాల్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ గణేష్‌నగర్‌లో ఒక వర్గానికి చెందిన నిర్మాణం అనుమతి లేకుండా చేపట్టారని, దీని గురించి ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కాలనీలో అక్రమ నిర్మాణాలు అరికట్టడంలో అధికారులు పూర్తిగా విఫలం అయ్యారని ఆరోపించారు. దీనిపై టిపిఎస్ సురేష్‌ను వివరణ కోరగా సదరు నిర్మాణానికి జి+2 అనుమతి ఉందని, కోర్టులో కేసు ఉండడంతో వారికి నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

## జీవ వైవిధ్యానికి ఆరోగ్యకర మృత్తికలు పట్టుగొమ్మలు : డా.విజయ్‌కుమార్

ఉప్పల్, డిసెంబరు 5 ప్రభాతవార్త : ప్రపంచ మృతిక దినోత్సవం సందర్భంగా గురువారం ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఎకో క్లబ్ వాలంటీర్లు, విద్యార్థులకు సుస్థిర వ్యవసాయంలో మృతికల ప్రాముఖ్యత గుచిం వివరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.కె.విజయ్ కుమార్ మాట్లాడుతూ జీవ ఎరువులు, జీవ రసాయనాలు వాటి ప్రాముఖ్యత, నేలకు అవి చేసే మేలు గురించి వివరించారు. అనంతమైన జీవ వైవిధ్యానికి ఆరోగ్యకరమైన నేలలే పట్టుగొమ్మలని, మనిషి మనుగడ అత్యంత ముఖ్యమైనదని ఆయన పేర్కొన్నారు. మృత్తికా సంరక్షణ, క్రమక్షయ నివారణ మార్గాలను వివరించారు. అనంతరం ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు జీవ వ్యర్థాలను ఎరువుగా మార్చే ప్రక్రియ కోసం వర్మీ కంపోస్ట్ గుంతలను తవ్వారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎస్‌ఎస్ పిఒ జల్దా విశ్వనాద్ కుమార్,ఎకో క్లబ్ సమన్వయకర్త కె.గీత, డా.సి.హెచ్. సత్యనారాయణ, డా. జి.తిరుపతయ్య, ఎస్.యమున, డా.వి.శ్రీ నివాస్‌రావు, పి.వెంకటేశ్వర్లు పలువురు అధ్యాపకులు, విద్యా ర్థులు పాల్గొన్నారు.

## సైదాబాద్‌లో గంజాయి స్వాధీనం..ఇద్దరు నిందితుల రిమాండ్

సైదాబాద్, డిసెంబరు 5 ప్రభాతవార్త: హైడ్రో పోనిక్ గంజాయిని విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను సైదాబాద్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. సైదాబాద్ కాలనీకి చెందిన సాయి తేజ(27) బెంగుళూరు నుంచి కొరియర్ ద్వారా హైడ్రోపోనిక్ గంజాయిని దిగుమతి చేసుకుని విక్రయిస్తుంటాడు. చంపాపేటలోని స్విమ్మింగ్ పూల్ సమీపంలో నివసించే మధుసూధన్‌రెడ్డి ఇతని వద్ద నుంచి గంజాయిని కొనుగోలు చేస్తుంటాడు. బుధవారం రాత్రి ఇద్దరు కలిసి కారులో వెళ్తుండగా విశ్వసనీయ సమాచారం అందుకున్న సైదాబాద్ పోలీసులు ఎస్ఐ సాయి కృష్ణ ఆధ్వర్యంలో దోభిఘాటు చౌరస్తాలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. అదే సమయంలో అక్కడకు వచ్చిన నిందితుల కారును ఆపి సోదా చేయగా 30 గ్రాముల హైడ్రో పోనిక్ గంజాయి దొరికింది. నిందితులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు.